MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 7 రంగారెడ్డి మార్చి 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## సూక్ష్మ రుణ సంస్థలకు మార్గదర్శనం !





ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ‘సెర్ప్’ల ఆధ్వర్యంలో . . . సా-ధన్, ఏపిమాస్ సంస్థల తోడ్పాటుతో ...
రుణ గ్రహీతలపట్ల సూక్ష్మరుణ సంస్థలు అనుసరించవలసిన పద్ధతులపై అవగాహన

## నైపుణ్య శిక్షణకు శ్రీకారం !



గోరంట్లపల్లిలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీమతి కీర్తిరెడ్డి

## ఢిల్లీ పీఠంపై మరో మహిళా ముఖ్యమంత్రి !



(శ్రీమతి రేఖా గుప్త

## మహిళా దినోత్సవ సంఘీభావం !



అందరు బాలలికలకు, మహిళలకు ....
హక్కులు, సమానత్వం, సాధికారత



తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఎఫ్ పి ఓలకు శిక్షణ !



చండీఘర్‌లో సి ఐ ఐ ఎఫ్ పి ఓలకు శిక్షణ !

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు- కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు





## జీవనోపాధులపై....



పెరిగే వలసలు



రోగాలతో పెరుగుతున్న ఖర్చులు



ఆహార భద్రతకు ముప్పు



పోషకాహార లోపాలు



తగ్గే ఉపాధి అవకాశాలు



పంట నష్టాలతో పెరిగే అప్పులు

NABARD

# మహిళా సాధికారత


సంపుటి 23 సంచిక 7



సంపాదకీయం

## సాధికారత !

**అ**ంతర్జాతీయ మహిళా దినోత్సవం మళ్ళీ వచ్చింది. ఐక్యరాజ్య సమితి ప్రకటన మేరకు కొద్దిపాటి మినహాయింపులతో ప్రపంచదేశాలంతటా, ప్రతి సంవత్సరం మార్చి 8 వ తేదీని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. సమాజంలో, ఇటు ఇంటా బయటా మహిళలకు తగిన గౌరవ ప్రపత్తులు, హక్కులు వుండాలని, ఆర్థిక సాధికారత, హుందాగా జీవించే అవకాశాలు, నిర్ణయాత్మక పాత్ర కల్పించాలన్న కొన్ని రాజీలేని సూత్రాలతో లైంగిక సమానత్వం, సాధికారత పరమ లక్ష్యాలుగా, సంఘటిత ఉద్యమ స్ఫూర్తితో ఈ మహిళాదినోత్సవం మొదలైంది. హక్కులకోసం మహిళలు మహోద్యమం సాగించిన చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమై 110 సంవత్సరాలకు పైనే అయినప్పటికి, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అర్ధశతాబ్దంగా, ప్రపంచవ్యాప్తంగా ఒకే రోజున మహిళా దినోత్సవం జరుగుతున్నది. ఆనంతరం ఈ ఉద్యమ ప్రస్థానం ఒక్కొక్క మెట్టుగా శిఖరాగ్రాన్ని చేరడానికి దిక్సూచిగా 1996 నుంచి ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క కార్యాచరణ ప్రణాళికను ఐక్యరాజ్య సమితి ప్రకటిస్తున్నది. ఆ ఏడాది దృష్టి కేంద్రీకరించవలసిన నినాదాన్ని అందిస్తున్నది. ఆ కోవలో, 'బాలికలతో సహా మహిళలందరికి హక్కులు, సమానత్వం, సాధికారత' అనే నినాదాన్ని 2025 మహిళా దినోత్సవ నినాదంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఇవన్నీ ఆహ్వానించదగిన శుభపరిణామాలే! అయితే, నెమ్మదిగానైనా, ఆశించిన స్థాయిలో సమాజంలో చైతన్యాన్ని రగిలించగలుగుతున్నామా అనేదే అసలు ప్రశ్న. ఎదుట వున్నది సాధారణ సమస్య కాదు. తరతరాలుగా, శత సహస్రాబ్దాలుగా వజ్ర శిలలా ఘనీభవించిన గడ్డు సమస్య. దానిని ద్రవీభవింపజేయడం, ఒక కొలిక్కి తేవడం తేలికైన విషయమేమీ కాదనేది కాదనలేని వాస్తవం. మహిళలకు సంబంధించిన విభిన్న అంశాలపై వివిధ స్థాయిలలో సాగిన ఉద్యమాల ఫలితమే సమాజంలో మెరుగైన నేటి మహిళా స్థాయి అనేది కూడా అంగీకరించితీరవలసిన అంశమే. కాని, ఒక సమన్వయ కర్తగా, స్ఫూర్తి ప్రదాతగా, ప్రేరణ సంస్థగా ఐక్యరాజ్య సమితి మహిళా సాధికారత సాధనపై మరీ మందకొడిగా అడుగులు వేస్తున్నదన్న అభిప్రాయం బలపడుతున్నది. కార్యాచరణ నినాదాలతోనే సరిపెడుతున్నదని, ఫలితాంశాల స్థాయి గురించి పట్టించుకోవడం లేదనే విమర్శ వుంది. ఉదాహరణకు 2005లో నినదించిన 'లైంగిక సమానత్వ' అంశమే, 2014, 2022లో కూడా ప్రధాన క్రియాశీలాంశమైంది. అదేవిధంగా, 2010లో, 2015లో మహిళా సాధికారత సాధన నినాదమైంది. ఆ కారణంగానే కావచ్చు, ప్రతిఏటా తానూ ఒక కార్యాచరణ అంశాన్ని ప్రకటించే 'ఇంటర్నేషనల్ విమెన్స్ డే' అనే సంస్థ ఈ ఏడాది 'కార్యాచరణ వేగం పెంచండి' (యాక్సిలరేట్ యాక్షన్) అనే సూచన చేసింది. లైంగిక సమానత్వ సాధనకోసం కార్యాచరణ వేగం పెరగవలసిన అవసరంఎంతైనా వున్నదని ఆ సంస్థ పేర్కొన్నది. మరో సందర్భంలో ఇదే సంస్థ లైంగిక సమానత్వం కోసమంటూ ప్రకటిస్తున్న సంకేతాలు, చిహ్నాలవల్ల (ఉదాహరణకు ఊదారంగు కప్ కేక్) ఒరిగేదేమీ వుండదని, యివి లక్ష్య సాధనలో శక్తిహీనంగా మారాయని ఎద్దేవా చేసింది. నిజమే, ఐక్యరాజ్య సమితి మందకొడితనాన్ని వీడి, మరింత ఉత్తేజాన్ని, సంఘటిత కార్యాచరణను రగిలించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఐక్యరాజ్య సమితి అధ్వర్యంలో మహిళా దినోత్సవ నిర్వహణ మొదలై యిది స్వర్ణోత్సవ సంవత్సరం అనే అంశం కూడా తగిన ప్రచారానికి నోచుకోలేదంటే ఏమనుకోవాలి? అంతిమంగా, పాలనాధికారమే బాగోగులను నిర్ణయిస్తుందనే వాస్తవాన్ని విస్మరించలేం. జనాభాలో సగంగా వున్న మహిళలకు చట్టసభలలో కేవలం 33శాతం సీట్లు కేటాయించాలనే బిల్లు అతీగతీ లేకుండా ఏళ్ళతరబడి ఎలా మూలనపడివున్నదో తెలిసిందే కదా! తన పరిమితులకు లోబడి అయినా సరే, యిలాంటి విషయాలలో ఐక్యరాజ్య సమితి కనీసపు చొరవ చూపనిదే ఆ మహోన్నత లక్ష్య సాధన ఎలా సాకారమవుతుంది? కేవలం సంకల్పంతో సరిపోదు, కార్యాచరణతోనే సంకల్పం సిద్ధిస్తుంది సుమా!



Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy

ఇతరులు నిన్ను అర్థం చేసుకోలేదని బాధపడడం కాదు, ముందుగా నిన్ను నీవు అర్థంచేసుకో

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి**  అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: బి మౌళి**

## లోపలి పేజీలలో ....


- మైక్రోఫైనాన్స్ సంస్థలకు మార్గదర్శనం ! 05
- గోరంట్లపల్లిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం! 08
- చండీగర్‌లో సి ఐ ఐ ఎఫ్ పి ఓలకు శిక్షణ 10
- ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం! 11
- విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు 12
- అనంత ఉద్యాన రైతుల సమ్మేళనం 13
- అక్షరాస్యత, ఆరోగ్యంపై ఎస్‌హెచ్‌జి శిక్షణ 14
- మదనపల్లె ప్రాంత ఎఫ్‌పిఓల పనితీరు.... 15
- రాయలసీమ నీటి ప్రాజెక్ట్‌లో సర్వే తీరుతెన్నులు 16
- లక్షమంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు 17
- మహిళలకి హక్కులు, సమానత్వం, సాధికారత 18
- సాధికారత దిశగా నడిపించే చైతన్యపథం! 20
- మద్యంపై మహిళల సంఘటిత పోరాటం! 21
- ప్రకృతిసాగులో ఆంధ్రప్రదేశ్‌కు అవార్డుల పంట 23
- ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా 24
- దున్నకుండా... రసాయనాల్లేకుండా సాగు! 25
- వ్యవసాయంలో స్వయంసహాయ మహిళాసైన్యం 27
- తాను మరణిస్తూ, మరో ఐదుగురికి ప్రాణదానం 29
- అవార్డులు సాధించిన మహిళా సర్పంచ్! 30
- రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య! 32
- ఒంగోలు జాతి పశువులకు విశ్వ కీర్తి కిరీటం ! 33


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

సానుకూల వైఖరి అంటే కేవలం ఆశాభావమే కాదు, జరిగేదంతా మంచికే అనే వివేచన

# మైక్రోఫైనాన్స్ సంస్థలకు మార్గదర్శనం !

**ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉన్నత స్థాయి సమావేశాలు ... సా-ధన్, ఏపిమాస్ సంస్థల చొరవతో ..**

**– మురళి జాజున, భవాని**

*ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010లో సూక్ష్మ రుణ (మైక్రోఫైనాన్స్) సంక్షోభం, విపత్కర పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు దశాబ్దం సూక్ష్మ రుణ సంస్థలకు (ఎం ఎఫ్ ఐ లకు) స్వర్ణయుగంగా చెలరేగింది. ఇబ్బడి ముబ్బడిగా సూక్ష్మ రుణ సంస్థలు వెలసి ఎడాపెడా రుణాలు మంజూరు చేయసాగాయి. రుణ గ్రహీతలు ప్రధానంగా స్వయం సహాయ సంఘాల (ఎస్ హెచ్ జి లు) సభ్యులు. ఎస్ హెచ్ జి మహిళలు తాము తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లిస్తుండడంతో సూక్ష్మ రుణ సంస్థలు పోటాపోటీగా వారికి అప్పులు యివ్వసాగాయి. ఆశించకుండానే అందివస్తుండడంతో కొందరు స్వయం సహాయ సంఘాల సభ్యులు అవసరం కాని, తీర్చగలిగే స్తోమత కాని లేకపోయినా, ఒకే సమయంలో అనేక సూక్ష్మ రుణ సంస్థలనుంచి రుణాలు పొందారు. కాని, తీరా తిరిగి చెల్లించవలసి వచ్చేసరికి ముఖం చాటేయసాగారు. ఇచ్చిన రుణాలు తిరిగి రాబట్టుకోవడానికి కొన్ని సూక్ష్మ రుణ సంస్థలు బలవంతపు వసూళ్ళకు పాల్పడ్డాయి. వత్తిడి తట్టుకోలేక కొందరు ఎస్ హెచ్ జి మహిళలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ పరిణామం ప్రభుత్వ జోక్యానికి దారి తీసింది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2010 అక్టోబర్‌లో సూక్ష్మ రుణ సంస్థల పరపతి నియంత్రణ పేరిట ఒక ఆర్డినెన్స్, అనంతరం 2011 జనవరిలో ఆ ఆర్డినెన్స్ స్థానంలో చట్టాన్ని తీసుకువచ్చి, సూక్ష్మ రుణ సంస్థల కట్టడికి ప్రయత్నించింది. వాణిజ్యపరమైన సూక్ష్మ రుణ సంస్థలు అధిక వడ్డీలు వసూలు చేయకుండా, ఎడాపెడా రుణాలు మంజూరు చేయకుండా, బలవంతపు వసూళ్ళకు పాల్పడకుండా నిరోధించాలన్నది ఈ నియంత్రణ ముఖ్య ఉద్దేశం. ఈ చట్టాన్ని సవాలుచేస్తూ, సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు 2023 మార్చిలో సూక్ష్మ రుణ సంస్థలపై నియంత్రణాధికారం రిజర్వ్ బ్యాంక్‌కి మాత్రమే వుంటుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2011లో జారీచేసిన చట్టం చెల్లదని తీర్పు చెప్పింది. అప్పటినుంచి సూక్ష్మ రుణ సంస్థలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో తిరిగి రుణాల మంజూరు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో, మళ్ళీ 2010కి ముందునాటి దుష్పరిణామాలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్న సదుద్దేశంతో సా-ధన్ సంస్థ, ఏపిమాస్ సంయుక్తంగా ఉభయరాష్ట్ర పభుత్వాలతో చర్చించి, ఉభయ ప్రభుత్వాల ఉన్నతాధికారులతో సూక్ష్మ రుణ సంస్థల ప్రతినిధుల సమావేశాల నిర్వహణకు చొరవచూపాయి. ఫలితంగా, 2025 ఫిబ్రవరి14 న తెలంగాణాలో, 2025 ఫిబ్రవరి 21న ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఉన్నతస్థాయి సమావేశాలు జరిగాయి.*

*(వివరాలు 6,7 పేజీలలో ...)*



నిగూఢ అవకాశాలను చూసే దార్శనికత, అసాధ్యాలను సాధించే తపన వుంటే గెలుపు మీదే

**పేద మహిళలు ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి పేదరికం నుంచి శ్రేయస్సు (పావర్టీ టు ప్రాస్పరిటీ) వైపు ప్రయాణం చేయడానికి సహాయపడటమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశం.**

### తెలంగాణా మైక్రో ఫైనాన్స్ సమావేశం

తెలంగాణా సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) సిఇఓ శ్రీమతి దివ్య దేవరాజన్ అధ్యక్షతన 2025 ఫిబ్రవరి14న హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయం స్త్రీనిధి సమావేశ మందిరంలో తెలంగాణా ప్రభుత్వం, సూక్ష్మ రుణ సంస్థల ప్రతినిధుల ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. సూక్ష్మ రుణ రంగానికి సంబంధించిన అనేక ఎన్‌బిఎఫ్‌సి-ఎమ్ఎఫ్ఐలు, ఎన్‌బిఎఫ్‌సిలు, ఎస్ఎఫ్‌బిలు, ప్రైవేట్ బ్యాంకులు, బిసి కంపెనీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు, ప్రభుత్వపరంగా, తెలంగాణ సెర్ప్ సి ఇ ఓ శ్రీమతి దివ్య దేవరాజన్, సీనియర్ సిబ్బంది, స్త్రీ నిధి ఎమ్‌డి శ్రీ జి.వి.ఎస్ రెడ్డి, సీనియర్ సిబ్బంది, ఈ సమన్వయ సమావేశానికి ముఖ్య ప్రేరకులైన సా-ధన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ జిజి మేమ్మన్, ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓ, ఎండి శ్రీ సి.యస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశంలో ముందుగా తెలంగాణలో మైక్రోఫైనాన్స్ గురించి సా-ధన్ ఇడి శ్రీ జిజి మేమ్మన్ ప్రజెంటేషన్ యిచ్చారు. అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతి మైక్రోఫైనాన్స్ ఏజెన్సీ తెలంగాణలో వారి మైక్రోఫైనాన్స్ కార్యకలాపాల వివరాలను వెల్లడించారు. సెర్ప్ బ్యాంక్ లింకేజ్ డైరెక్టర్ శ్రీ వై. ఎన్.రెడ్డి, స్త్రీ నిధి ఎమ్‌డి శ్రీ జి.వి.ఎస్ రెడ్డి తెలంగాణలో ఎస్‌హెచ్‌జి ఉద్యమం గురించి, ఎస్‌హెచ్‌జిల సంస్థాగత నిర్మాణం (ఎస్‌హెచ్‌జి-విఓ-ఎమ్ఎస్) గురించి వివరించారు. తెలంగాణాలో ఎస్‌హెచ్‌జి లు రూ. 40,000 కోట్లకు పైగా (బ్యాంక్ రుణాలు, స్త్రీ నిధి రుణాలు, మహిళల స్వంత పొదుపులు, గ్రాంట్లు సహా) ఆర్థిక వ్యవహారాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

### సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు

1. మైక్రోఫైనాన్స్ రుణదాతలందరూ సా-ధన్ నమూనా ప్రవర్తనా నియమావళి ప్రకారం, రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం బాధ్యతాయుతమైన రుణ వితరణ పద్ధతులను పాటించాలి.
2. క్రెడిట్ బ్యూరోలో స్వయంసహాయ సమాఖ్యల నుండి రుణాలుపొంది, తిరిగి చెల్లించని (ఎస్ హెచ్ జి సభ్యుల) డిఫాల్టర్ల వివరాలు ఉండక పోవడం వల్ల స్థానిక విలేజ్ ఆర్గనైజేషన్స్ (విఓ-ఎస్‌హెచ్‌జిల గ్రామ స్థాయి సమాఖ్య) లేదా స్లమ్ లెవెల్ ఫెడరేషన్స్ (ఎస్ఎల్ఎఫ్‌లు) నుండి 'డిఫాల్టింగ్ ఎస్‌హెచ్‌జి సభ్యులు' జాబితాను పొందాలని, అట్టి బకాయి పడిన సభ్యులకు తిరిగి రుణాలు ఇవ్వకూడదని ఎమ్ఎఫ్ఐ లకు సూచించారు.
3. పేద మహిళలు అప్పుల ఊబిలో పడకుండా ఉండటానికి అన్ని మైక్రోఫైనాన్స్ రుణదాతలు ఆర్థిక అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని, రుణాలు మమజూరుచేసే ముందు క్రెడిట్ చరిత్రను సరిగ్గా అంచనా వేయాలని సూచించారు.
4. తెలంగాణ మహిళల శ్రేయస్సు కోసం, డేటా మార్పిడి కోసం కలిసి పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఎమ్ఎఫ్ఐలతో, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది. మైక్రోఫైనాన్స్ ఖాతాదారులను వేధించే సంఘటనలు ఉండకూడదు.
5. అధిక రుణభారం కారణంగా మహిళల ఆత్మహత్యలను నివారించడానికి కలిసి పని చేయాలని, అన్ని మైక్రో ఫైనాన్స్ రుణదాతలు త్రైమాసిక జిల్లా సంప్రదింపుల సంఘం (డిసిసి) సమావేశానికి (జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే బ్యాంకర్ల సమావేశం) హాజరు కావాలని, జిల్లాలో వారి కార్యకలాపాల గురించి వివరించాలని సూచించారు.

### ఆంధ్రప్రదేశ్ మైక్రో ఫైనాన్స్ సమావేశం

**ఆం**ధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు (ఎన్ బి ఎఫ్ సి - ఎం ఎఫ్ ఐ ఎస్), చిన్న ఫైనాన్స్



ఆంధ్రప్రదేశ్ మైక్రోఫైనాన్స్ సమావేశం దృశ్యం

బ్యాంకుల (ఎస్ ఎఫ్ బి లు) సమావేశం 2025 ఫిబ్రవరి21 న విజయవాడలో జరిగింది.

ఈ సమావేశాన్ని సా-ధన్ సంస్థ, ఏపిమాస్ సహకారంతో నిర్వహించారు. దాదాపు 30 మైక్రోఫైనాన్స్ సంస్థలు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులు పాల్గొనగా, సెర్ప్, శ్రీనిధి, మెప్మా నుండి సి ఇ ఓ, పి డి లు ఇతర పలువురు అధికారులు పాల్గొన్నారు. నాబార్డ్ (జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్) ఆంధ్రప్రదేశ్ సిజిఎం శ్రీ గోపాల్, ఎస్ ఎల్ బి సి, ఎ పి సి ఓ బి ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇ ఎస్ ఎ ఎఫ్ బ్యాంక్, ఐ ఐ ఎఫ్ ఎల్ సమస్తా ఫైనాన్స్ లిమిటెడ్, మెప్మా ఏపీ, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ మొదలైన సంస్థలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

సెర్ప్ – ఏపీ సి ఇ ఓ, రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్–ఆఫీషియో సెక్రటరీ శ్రీమతి కరుణ ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా, ఏపీ మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సమావేశ విశేషాలు:**

ఈ తొలి సమావేశం ఎంతో ఫలప్రదంగా సాగింది. ముఖ్యంగా మైక్రో ఫైనాన్స్ సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సమన్వయాన్ని, సమాచార మార్పిడిని పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యంగా పేద మహిళలు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా చూడటమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం సాగింది.

రాష్ట్ర, జిల్లా స్థాయిలలో త్రైమాసిక, అర్ధ వార్షిక సమీక్షా సమావేశాలు నిర్వహించడం, డిఫాల్టర్ల (అప్పు తిరిగి చెల్లించని వ్యక్తుల) సమాచారాన్ని ప్రభుత్వంతో , మైక్రో ఫైనాన్స్ సంస్థలతో పంచుకోవడం ద్వారా ఋణవ్యవస్థ మరింత మెరుగవుతుందని సమావేశం అభిప్రాయపడింది. సా-ధన్ వారు సెర్ప్ , మెప్మా సిబ్బందికి మైక్రో ఫైనాన్స్ సంస్థల పనితీరు, నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై ఒక వర్చువల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించదానికి నిర్ణయించారు

మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళల నిజమైన వ్యాపార అవసరాల ఆధారంగా మాత్రమే రుణాలు మంజూరు చేయాలని, అనవసరపు, అధిక వడ్డీ రుణాల మంజూరును నియంత్రించాలని, బలవంతపు వసూళ్ళను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించకూడదని, అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఉమ్మడిగా ఆర్థిక అక్షరాస్యతపై (ఫైనాన్షియల్ లిటరసీ) ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్వయం సహాయక సంఘాల సమాఖ్యలను (ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్స్) అన్ని స్థాయిల్లో (గ్రామం/నగరం, మండలం/పట్టణం, జిల్లా స్థాయిలో) బలోపేతం చేసి, వీటిని స్వీయ నియంత్రణ సంస్థలుగా (సెల్ఫ్–రెగ్యులేటరీ ఆర్గనైజేషన్స్) అభివృద్ధి చేయాలని, సంస్థల మధ్య సమన్వయానికి ప్రతి మైక్రో ఫైనాన్స్ సంస్థ, చిన్న ఫైనాన్స్ బ్యాంక్ తమ సంస్థ తరపున రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ఒక ప్రత్యేక ప్రతినిధిని నియమించాలని సూచనలు చేశారు. ■

వేరెవ్వరో ప్రోత్సహించడం కాదు, నిన్ను నీవే ప్రోత్సహించుకోవాలి ; స్వయం ప్రోత్సాహం అమోఘం

# గోరంట్లపల్లిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం!

## అరబిందో ఫార్మా ఆర్థిక సహకారం, ఏపిమాస్ తోడ్పాటుతో ....

– భార్గవి, వినాయకరెడ్డి

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లాలోని కె వి పల్లి మండలం గోరంట్లపల్లిలో యువతకు, మహిళలకు జీవనోపాధుల నైపుణ్యాలను పెంపొందించాలన్న సదుద్దేశంతో అరబిందో ఫార్మా ఆర్థిక సహకారంతో, ఏపిమాస్ తోడ్పాటుతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) ఏర్పాటైంది.



అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్, అరబిందో ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ శ్రీ. కె. నిత్యానంద రెడ్డి, ఏపిమాస్ సి ఇ ఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ టి. చంద్రశేఖర్ రెడ్డి, గాడియం స్కూల్ వ్యవస్థాపకురాలు, అరబిందో ఫార్మా ప్రమోటర్ శ్రీమతి కీర్తి రెడ్డి ఈకేంద్రం ఏర్పాటులో కీలకపాత్ర వహించారు.

2025 ఫిబ్రవరి 26 వ తేదీన వీరు ఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా యువతకు కంప్యూటర్ శిక్షణ, మహిళలకు కుట్టు మిషన్ శిక్షణకు సంబంధించిన నైపుణ్యాలను అందిస్తారు.

### నవ్యతకు, అభివృద్ధికి కేంద్రం

ఈ నూతనంగా ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో విభిన్న రకాల వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయి.

ఇందులో సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ విద్య, యువతకు కంప్యూటర్ శిక్షణ, మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ, ప్రత్యేక వ్యవసాయ శిక్షణ కోర్సులు ఉంటాయి. ఆధునిక అవసరాలు, పరిశ్రమల ప్రమాణాలకనుగుణంగా రూపొందించిన శిక్షణ మార్గ దర్శకాలు, అనుభవజ్ఞులైన బోధకులతో ఈ సెంటర్ యువత, మహిళలు తమ జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచు కునేందుకు తగిన అవకాశాలను అందిస్తుంది.

ఈ సందర్భంగా జరిగిన సభనుద్దేశించి, శ్రీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నైపుణ్యాభి వృద్ధి దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ యువత ప్రతిభను పెంపొందించి, వారికి పోటీ ప్రపంచంలో రాణించేందుకు మార్గం చూపుతుందని, పరిశ్రమ ప్రముఖులతో, సాంకేతిక విద్యాసంస్థలతో, ప్రభుత్వ సంస్థలతో కలిసి పని చేస్తుందని ఆయన తెలిపారు.

### స్థిరమైన అభివృద్ధికి దారి ప్రకృతి వ్యవసాయం

ఈ ప్రారంభోత్సవానికి అనుబంధంగా ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు సేవ్. ఆర్గ్ వ్యవస్థాపకులు శ్రీ విజయరామ్, మా పల్లె ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీ. నరసింహరెడ్డి, అలాగే లిటిల్




మ్యుజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీ రామాచారి, రైతులు పాల్గొని సహజ వ్యవసాయ విధానాలు, నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, రసాయనాలపై ఆధారపడకుండా వ్యవసాయాన్ని నిర్వహించడాన్ని గురించి చర్చించారు.

ఈ సమావేశంలో నిపుణులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు అనుసరించవలసిన విధానాలు, రైతుల అవసరాలకు అనుగుణంగా అందించవలసిన మార్గ దర్శకాలను గురించి ప్రస్తావించారు. సహజ వ్యవసాయాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు. మరికొందరు రైతులు రసాయన రహిత వ్యవసాయాన్ని సాగించేందుకు తమ సుముఖతను వ్యక్తంచేశారు.

శ్రీ విజయరామ్ ప్రధాన ప్రసంగం చేస్తూ, "ప్రకృతి వ్యవసాయం కేవలం ఒక వ్యవసాయ పద్ధతి మాత్రమే కాదు, ఇది భూమి ఆరోగ్యాన్ని కాపాడే, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించే, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే ఉద్యమం. రసాయన ఎరువులపైన, రసాయనిక పురుగుమందులపైన ఆధారపడకుండా వ్యవసాయం సాగిస్తే, పర్యావరణ పరిరక్షణకు తోడు రైతుల ఆదాదాయం కూడా పెరుగుతుంది. ఈ మార్గంలో రైతులకు అవసరమైన మద్దతు, ఆర్థిక సహాయం, అవగాహన కార్యక్రమాలను అందించేందుకు కట్టుబడి వున్నాం" అని పేర్కొన్నారు.

**భవిష్యత్ అభివృద్ధికి ప్రతిజ్ఞ**

ఈ కార్యక్రమం నైపుణ్యాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కీలకమైన మైలురాయిగా నిలిచింది. ప్రభుత్వం, సేవా సంస్థలు, పరిశ్రమ ప్రముఖుల (ఉషా శిలాయి స్కూల్స్) మధ్య పలు కుదిరిన పలు అవగాహన ఒప్పందాలు ఈ రంగాల్లో మరింత అభివృద్ధికి దోహదం చేయనున్నాయి.

ఈ కార్యక్రమాలు ఉద్యోగ అవకాశాల పెరుగుదలకే కాకుండా, వ్యవసాయ రంగంలో నూతన మార్పులను తీసుకురావడానికి తోడ్పడతాయి.

ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వేలాది మంది యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించనుండగా, ప్రకృతి వ్యవసాయ విధానాల ప్రోత్సాహం రైతుల ఆర్థిక భద్రతను పెంచడంతో పాటు వ్యవసాయ స్థిరతకు సహాయపడనుంది.

ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీ గుణశేఖర్ పిళ్ళై, కాకినాడ అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ శ్రీ సుధాకర్, ఏపిమాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వినాయకరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భార్గవి, పలువురు యువతీయువకులు, రైతులు పాల్గొన్నారు. ■

నీ మాట నిజమైతే అభినందించేవారు కొందరే, నిజం కాకుంటే నిందించేవారు ఎందరో

# చండీఘర్‌లో సి ఐ ఐ ఎఫ్ పి ఓలకు శిక్షణ

– జి.శ్రీనివాస్



హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సి.ఐ.ఐ) సహకారం అందిస్తున్న రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్‌పిఓల) పాలక వర్గ సభ్యులకు, వారి సిబ్బందికి ఎఫ్ పి ఓల నిర్వహణపై చండీగర్‌లో 2025 ఫిబ్రవరి 11-12 తేదీలలో రెండు రోజుల పాటు ఏపిమాస్ బృందం శిక్షణ నిర్వహించింది. ఏపిమాస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీ జి. శ్రీనివాస్, మార్కెటింగ్, బిజినెస్ ఎక్స్‌పర్ట్ శ్రీ సతీష్ కుమార్ ఈ శిక్షణను నిర్వహించారు.

ఈ శిక్షణకు ఆర్థిక సహకారం అందిస్తున్న కాన్ఫెడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ) సంస్థ తరపున కోఆర్డినేటర్లుగా రోలిపాండే, రశ్మి కుమారి గార్లు సహకారం అందించారు. ఈ శిక్షణలో ఎనిమిదిఎఫ్ పి సి ల నుండి 20 మంది అభ్యాసకులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు శిక్షణలో పాల్గొన్న ఎనిమిది రైతు ఉత్పత్తిదారుల కంపెనీల ప్రతినిధులు వ్యవసాయంలో తమ అనుభవాలను పంచుకున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆవశ్యకత గురించి, ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులకు, పాలకవర్గానికి, సిబ్బందికి మధ్య ఉన్న సంబంధం గురించి, మహాసభ, పాలకవర్గం, సిబ్బంది విధులు, బాధ్యతలు, సంస్థలో నిర్వహించే సమావేశాలు, అందించే సేవలు, వ్యాపార ప్రణాళికలు, వివిధరకాల పుస్తక నిర్వహణ, మంచి పద్ధతులు, చట్టపరమైన కార్యక్రమాలు మొదలగు అంశాలపై సహభాగ శిక్షణ పద్దతులు ఉపయోగిస్తూ సభ్యులను, సభ్యులచే వివిధ యాక్టివిటీస్ చేస్తూ శిక్షణ ఇవ్వటం జరిగింది.



శిక్షణలో పాల్గొన్న అభ్యాసకులు మాట్లాడుతూ శిక్షణ ఎంతో బాగుందని, ఎంతో ఉపయోగకరం ఉందనీ, ఇట్టి శిక్షణలో నేర్చుకున్న అంశాలను వారి రైతు ఉత్పత్తిసంఘాలలో అమలు అయ్యే లాగా చూస్తామని తెలిపారు. శిక్షణ ఏర్పాటు చేసిన కాన్ఫెడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ) వారికి, శిక్షణ ఇచ్చిన ఏపిమాస్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కన్న నీవెలాంటివాడివో తెలుస్తుంది.

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం!

– జి ఆర్ అమరేంద్ర

రాయలసీమ వాటర్ ఇనీషియేటివ్ ప్రాజెక్టులో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు మదనపల్లి సియల్ఆర్‌సిలో 25.02.2025న జరిగింది. ఈ అవగాహన సదస్సులో హైదరాబాదుకు చెందిన సేవ్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ విజయరాం, నిజామాబాద్ మాపల్లె ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ నరసింహారెడ్డి ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యంపై ప్రసంగించగా, ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి యస్ రెడ్డి సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సదస్సుకు రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్టు నుండి లీడ్ ఫార్మర్స్, ఇతర రైతులు, ప్రాజెక్టు సిబ్బంది, సిఆర్ పి లు, ఎ పి సియన్ యఫ్ నుండి ఇసిఆర్పీలు మొత్తం 142 మంది హాజరయ్యారు.



ముందుగా, శ్రీ నరసింహ రెడ్డి మాట్లాడుతూ "మేము వెంకటేశ్వరస్వామి గుడి నిర్మించి, ఆలయ భూమిగా 80 ఎకరాల లో 18రకాల దేశీ వరి రకాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తూ, రైతులను ఆ విధానం పట్ల ప్రోత్సహిస్తూ వచ్చిన ధాన్యాన్ని దేవునికి నైవేద్యం, భక్తులకు అన్నదానం లాంటి కార్యక్రమాలు చేస్తున్నాం" అని తెలిపారు. ఇతను వ్యవసాయంలో రసాయనాల వాడకం దుష్ఫలితాల గురించి శ్రీ నరసింహారెడ్డి వివరిస్తూ, రసాయనిక వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా, ఎందరో అనారోగ్యం పాలవుతున్నారని, చాలామంది ఆడవారు పిల్లలు పుట్టక ఫెర్టిలిటీ సెంటర్లకు వెడుతున్నారని చెప్పారు.

శ్రీ విజయరాం ప్రసంగిస్తూ, ప్రకృతి వ్యవసాయం వలన గాలి, నీరు, భూమి, ఆరోగ్యం మెరుగవుతుందని, కాని రసాయనిక వ్యవసాయంతో ప్రస్తుతం అవి కలుషితమై భూమిలోని సహజ మిత్ర జీవరాశి నాశనమై రైతుకు, పంటలకు, వినియోగదారులకు చేటు వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మనం దేశీ విత్తనాలను, దేశీ గో సంపదను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశీ గోవులకు మూపురం ఉంటుందని, దీనిలోని సూర్య కేతు నంది నరము ద్వారా యివి సూర్య కిరణాలను గ్రహించి ఆరోగ్యమైన పాలనిస్తాయని తెలిపారు. గోవు ఉప ఉత్పత్తుల ద్వారా తయారయ్యే పంచగవ్యతో యిటు ప్రకృతి వ్యవసాయం లోను, అటు అనేక ఆరోగ్యసమస్యలకు పరిష్కారాలు దొరకు తున్నాయని తెలిపారు. రైతులు ప్రకృతిలో దొరికే ఉత్పత్తు లతో గ్రీన్ పెళ్లి మంటపాలు వేసి ఖర్చు తగ్గించి పెళ్ళిళ్ళు చేసుకోవాలని ఆయన కోరారు. ఐదు అంచెల పంటలు పండించి ఎక్కువ ఉత్పత్తి, అధిక ఆదాయం పొందాలన్నారు.

సంస్కృత ఉపాధ్యాయుడుగా పని చేసి,ఉద్యోగ విరమణచేసి, ప్రస్తుతం దేశీ విత్తనాలు సేకరిస్తూ 55 రకాల వరి, టమాట, అరటి వంగడాలను సంరక్షి స్తున్న పలమనేరుకు చెందిన శ్రీ చందుల్ కుమార్ మాట్లాడుతూ, వరి దేశీ వంగడాలైన కాలబట్టి, చిట్టి ముత్యాలు, నవారా , బహురూపి లాంటి రకాలు, టమాటలో మదనపల్లి రకాన్ని తాను సంరక్షిస్తున్నట్టు తెలిపారు. పూర్వం పండించే ప్రతి దేశీ వంగడానికి ఒక ప్రత్యేకత వున్నదని, ప్రస్తుత ఆరోగ్య రుగ్మతలకు పరిష్కారాలైన దేశీ రకాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన వున్నదని అన్నారు.

శ్రీ సి యస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు మిత్ర ప్రకృతి వ్యవసాయ సాగుకు ఉద్యమకర్తలుగా పని చేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని సూచించారు.

సదస్సు అనంతరము శ్రీ విజయరాం , శ్రీ నరసింహారెడ్డి రాయలసీమ వాటర్ ఇనీషియేటివ్ ప్రాజెక్టులోని ఐదు అంచెల వ్యవసాయం , మిరప సేంద్రియ వ్యవసాయ పొలాన్ని సందర్శించి తగిన సూచనలు చేశారు. ■

అవకాశాలు, అదృష్టమూ సూర్యోదయం లాంటివి ; సమయానికి మేలుకోకపోతే అందకుండా పోతాయి

# పాఠశాలల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు

– జాహ్నవి, భవాని

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం ఫిబ్రవరి 10వ తేదిన నేషనల్ డీవార్మింగ్ డే (నులిపురుగుల నివారణా దినోత్సవం) సందర్భంగా, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 250 మంది పిల్లలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. పిల్లలను పొట్ట లోపలి నట్ట పురుగుల (ఇంటెస్టైయినల్ వార్మ్స్) సంక్రమణ నుండి రక్షించడం ద్వారా సరైన పోషణ ద్వారా మొత్తంగా పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం అనే ప్రధాన లక్ష్యంతో నిర్వహించబడింది.



**డీవార్మింగ్ ప్రాముఖ్యత**

ఈ సెషన్‌లో, డీవార్మింగ్ వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి వివరించడం జరిగింది :

♦ రోగనిరోధక శక్తిని పెంచడం: నులి పురుగుల(నట్టలు) సంక్రమణల వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థ దెబ్బతినకుండా చూడడం.

♦ రక్తహీనత , పోషక లోపాలను తగ్గించడం: పురుగులు శరీరంలోని పోషకాలను గ్రహించడం వల్ల రక్తహీనత (అనీమియా) , ఇతర పోషక లోపాలు ఏర్పడతాయి. డీవార్మింగ్ ద్వారా దీన్ని నివారించవచ్చు.

♦ శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించడం:పేగుల్లో పురుగుల వల్ల మానసిక ఆందోళన , ఒత్తిడి సమస్యలు తలెత్తుతాయి.

**ఉచితంగా డీవార్మింగ్ మాత్రలు**

భారత ప్రభుత్వం 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా అల్బెండజోల్ (డీ వార్మింగ్) మాత్రలు అందిస్తుంది. ఇవి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేయబడతాయి. పిల్లలందరూ ఈ మాత్రలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

**పురుగుల సంక్రమణ లక్షణాలు, తల్లిదండ్రుల బాధ్యత**

ఈ సెషన్‌లో, పురుగుల సంక్రమణ లక్షణాలను గురించి వివరించాము. ఆ లక్షణాలు:

♦ భోజనం తిన్నా కూడా బరువు పెరగకపోవడం

♦ తినే ధోరణిలో మార్పు (ఆకలి తగ్గిపోవడం లేదా అధికంగా ఆకలి వేయడం)

♦ పొత్తికడుపులో నొప్పి

♦ అలసట, అశక్తత

♦ ముఖం ముడుచుకోవడం, ఒత్తిడి భావన

పిల్లలు ఈ డీవార్మింగ్ మాత్రలను తప్పకుండా తీసుకునేలా తల్లిదండ్రులు, సంరక్షకులు చూడాలని సూచించడం జరిగింది. ఇవి పిల్లల పేగుల్లో పురుగుల సంక్రమణ నుంచి రక్షణ కల్పిస్తాయి.

**పునరుత్పత్తి పై అవగాహన.**

ఫిబ్రవరి 12వ తేదిన యవ్వన , పునరుత్పత్తి ఆరోగ్య అవగాహన దినోత్సవం సందర్భంగా , శ్రీ గాయత్రి పాఠశాల (కర్వాన్), జడ్ పి హెచ్ ఎస్ దేవాల్జాంసింగ్ పాఠశాల (గుడిమల్కాపూర్) లలో 6–9వ తరగతులకు చెందిన 200 మంది విద్యార్థినులకు నెలసరి సమయంలో ఆరోగ్యం, పరిశుభ్రత పై ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం అవగాహన సదస్సులు నిర్వహించింది.

బహిష్టు సమయంలో ఆరోగ్య సంరక్షణపై చర్చించడంతో పాటు, ఆ సమయంలో పరిశుభ్రత, శానిటరీ నాప్‌కిన్స్ వినియోగం గురించి వివరించారు. నెలసరి గురించి సమాజంలో ఉన్న అపోహలు, మూఢనమ్మకాల గురించి చర్చించారు, విద్యార్థినులు తమ సందేహాలను స్నేహంగా ప్రశ్నిస్తూ, చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు. ■

# అనంత ఉద్యాన రైతుల సమ్మేళనం

- సి. గోపాలరాజు

అనంతపురం జిల్లాలోని 700 మంది ఉద్యాన పంటల రైతులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో 2025 ఫిబ్రవరి 5న ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఉద్యాన పంటల రైతుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్యం, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం మెంటార్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయం, సహకార శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్. వి.



వినోద్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉద్యానపంటల సాగు బాగా చేస్తున్నారు. ఈ ఉద్యాన పంటల సమ్మేళనం నిర్వహిస్తున్న ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, జిల్లాలో ఉద్యాన సాగులో వినూత్న పద్ధతులతో భవిష్యత్‌లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి, జిల్లాకు ఉద్యానపంటల సాగులో ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడమని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఆ లక్ష్యాలు యివి:

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండించే ఉద్యాన పంటలకు స్థానిక స్థాయి నుండి ప్రపంచ స్థాయికి గిరాకీ పెంచడం.
- సమ్మేళనం ద్వారా రైతులకు, కొనుగోలు దారులకు మధ్య మార్కెటింగ్ లింకేజీ ఏర్పాటు చేయడం
- ఉత్పత్తి పూర్వదశ, ఉత్పత్తి దశ, ఉత్పత్తి తరువాత దశలలో కావలసిన సాంకేతికతను, కృత్రిమ మేధస్సును రైతులకు అందుబాటులోకి తీసుకురావడం
- ఉద్యాన పంటల ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు
- మొదటి దశ నుండి మార్కెటింగ్ దశ వరకు కావలసిన యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తేవడం
- జిల్లాను ఉద్యాన పంటల హబ్ స్థాయి నుండి గ్రోత్ ఇంజిన్స్ స్థాయికి తీసుకెళ్లడం
- ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ వారితో ఒప్పందాలు చేసుకోవడం
- వికసిత్ భారత్ -2047 కార్యక్రమాల నిర్వహణ
- వ్యవసాయ రంగంలో విలువ పెంపు
- సాంప్రదాయ వ్యవసాయ పద్ధతి నుండి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోకి మారడం
- ఇలాంటి సమ్మేళనం ప్రతి సంవత్సరం నిర్వహించి రైతులలో అవగాహన కల్పించడం
- సమ్మేళనం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించడం

ఉద్యాన పంటలు, రైతు సంస్థలు, కోత, యంత్ర పరికరాలు, ఫైనాన్స్, టెక్నాలజీ వంటి అంశాలపై నిష్ణాతులతో సమాంతర తరగతులు నిర్వహించారు.

సమ్మేళనానికి 67 ప్రాసెసింగ్ ,ఇన్‌పుట్ ఏజెన్సీల వారు హాజరయ్యారు. 20 బహిరంగ ఎగ్జిబిషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 700 మంది ఉద్యాన రైతులు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుండి జిల్లా ఉద్యాన అధికారులు, వ్యవసాయ అధికారులు, సూక్ష్మ సేద్యం అధికారులు, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అటవీ అధికారి శ్రీ విఘ్నేశ్ వందన సమర్పణతో సమ్మేళనం ముగిసింది. ■

నీవు చేయవలసింది నీ సవాళ్లను పరిమితం చేసుకోవడం కాదు , నీ పరిమితులను సవాలు చేయడం

# ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్యంపై ఎస్ హెచ్ జి మహిళలకు శిక్షణ

–జాహ్నవి, ప్రగతి

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం ఖాలికాబర్, శివాజినగర్‌లలో 90 మంది స్వయంసహాయ సంఘాల (ఎస్ హెచ్ జి ల) మహిళల కోసం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. ఈ శిక్షణలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, ఖాతా పద్ధతులు, ఆదాయ–వ్యయాల రికార్డు ప్రాధాన్యత, మరియు అంతర్గత రుణాల వల్ల కలిగే లాభాల గురించి, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం జరిగింది.

గర్భవతులు, బాలింతల ఆహారపు అలవాట్లు గురించి అడిగి తెలుసుకుని, వారు ఎలాంటి ఆహారం తినాలి, వారు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి స్పష్టంగా వివరించి, ప్రతి స్వయం సహాయ సంఘ మహిళ తమ పరిధిలో, తమ బస్తీలో ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి తగిన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై ముఖ్యమైన సందేశాలను పంచుకోవాలి అని వివరించాము.

గర్భిణులు ఐసీడీఎస్, ఆరోగ్య సేవల కోసం ముందస్తు నమోదు చేయించడం, ఐరన్–ఫాలిక్ యాసిడ్ (ఐఎఫ్ఏ), కాల్షియం (సిఏ) మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం, రెండు టీకాలు, నాలుగు ఆరోగ్య తనిఖీలు తప్పనిసరిగా చేయించుకోవల్సిందిగా సూచించడం జరిగింది.

అలాగే కనీసం ఐదు ఆహారా సమూహాలను తమ రోజువారీ ఆహారంలో ఉండేటట్లు ప్రోత్సహించాలని, అంతే కాకుండా మధ్యాహ్నం రెండు గంటలపాటు విశ్రాంతి తీసుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది.

ప్రసవానికి ముందస్తు సిద్ధతపై అవగాహన కల్పించడంతో పాటు కుటుంబ సభ్యులు ఇంటి పనులలో సహాయం అందించాలని, బాలింతలకు ప్రసవం తర్వాత వెంటనే పాలిచ్చే ప్రాధాన్యతను వివరించి మొదటి ఆరు నెలలు వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి అని, అంతే కాకుండా రెండు సంవత్సరాల వయసు గల పిల్లల తలుల్లకు వయస్సుకు తగిన పూర్తి ఆహారాన్ని అందించాలి అని ప్రోత్సహించడమైనది.

**సామూహిక అన్నప్రాసన**

సంఘ సభ్యుల సమక్షంలో సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించబడింది. అన్నప్రాసనలో తల్లులకు పిల్లలకు పౌష్టికాహారాలు, శిశువు ఆరోగ్యకరమైన (ఎత్తు,



బరువు) పెరుగుదల కోసం వయస్సుకు అనుగుణంగా పూర్తి ఆహారం అందించడం ఎంత ముఖ్యమో ప్రత్యక్ష ఆహార నమూనాలతో వివరిస్తూ, ఐసీడీఎస్ సరఫరా చేసే బాలామృతం అందించడం జరిగింది. ఉగ్గు, కిచిడీ, అరటి పండు, బొప్పాయి, ఆకుకూరలు, ఉడికించిన ఆలుగడ్డలు, క్యారెట్, కోడిగుడ్లు వంటి సులభమైన, పౌష్టికమైన ఆహారాల ప్రాధాన్యతను వివరించడంతోపాటు, ఆహార మేళా ద్వారా మహిళలకు సంతులిత ఆహార ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ ట్రస్ట్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, ఏపిమాస్ ఆరోగ్య వలంటీర్లు , స్వయంసహాయ సమూహాల సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వలన ఆర్థిక అక్షరాస్యత, పోషణ, ఆరోగ్యం పైన అవగాహనను పెంపొందించింది. ■

కృషికి మంచి సమయం రేపెప్పుడో కాదు, ఇప్పుడే, ఈ క్షణమే!

# మదనపల్లె ప్రాంత ఎఫ్‌పిఓల పనితీరుపై పరిశీలన

– భవాని

2025 ఫిబ్రవరి 12, 13 తేదీలలో ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి, ఎస్‌బిఐ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ సుభదీప్‌తో కలిసి మదనపల్లె ప్రాంతంలో ఏపిమాస్ తోడ్పాటుతో చేపడుతున్న కార్యక్రమాలను సందర్శించారు. ఈ క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని ఏపిమాస్ సిబ్బంది శ్రీ రమేష్ రెడ్డి, శ్రీ అమరేంద్ర, శ్రీ వాసు, శ్రీ మధుసూదన్ శ్రీ వినయ్ రెడ్డి సమన్వయం చేశారు.

మొదటగా, ఈ బృందం దేశంలో పేరెన్నికగన్న మదనపల్లి టమాటా మార్కెట్‌ను సందర్శించారు. ఆక్షన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ మార్కెట్లో ఎఫ్‌పిఓలు, ఎఫ్‌పిఓ ఫెడరేషన్ల ద్వారా రైతులు తమ ఉత్పత్తులను విక్రయించే విధానాన్ని గమనించారు.

అనంతరం సేంద్రియ సాగు పద్ధతిని పరిశీలించడం కోసం ఈ బృందం ఒక రైతు మిరప సాగు పొలాన్ని సందర్శించింది. ఆ రైతు తాను సేంద్రియ విధానంలో చేస్తున్న సాగు తీరును వివరించారు. జీవామృతం తయారీ, ఇతర సేంద్రియ ద్రావణాలను ఉపయోగించడం, ఐదు అంచెల సాగు నమూనాను చూపించి వివరించాడు. తాను మొదటి విడతలో రూ.15,000 లాభం పొందానని, యిప్పుడు రెండవ విడతలో మరింత లాభం వస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నాడు.

అనంతరం శ్రీమతి రామలక్ష్మి బృందం ఎం టమాట ఫెడరేషన్ బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఫెడరేషన్ అవసరం, దాని పనితీరు, సవాళ్ళ గురించి చర్చించారు. ప్రస్తుతం వారు మల్చింగ్ షీట్స్ ను స్థానిక ఏజెంట్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు, కాని కంపెనీతో నేరుగా ఒప్పందం చేసుకోవాలనే ఆలోచనలో వున్నట్టు తెలిపారు. ఎఫ్‌పిఓలు చెల్లించే సర్వీస్ ఫీజు, క్రెడిట్ సేల్స్ , తిరిగి వసూళ్ళ వంటి అంశాలపై చర్చ జరిగింది. వ్యవసాయ క్షేత్రం వద్దనే వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల (అవుట్‌పుట్ మార్కెటింగ్) పరిశీలనలో భాగంగా నిమ్మనపల్లె ఎఫ్‌పిఓ పరిధిలోని 30 ఎకరాల లీజ్ భూమిని సందర్శించారు. కర్ణాటక నుండి ఒక కొనుగోలుదారుని సంప్రదించి గ్రేడ్ 1 కర్బూజా (మస్క్‌మెలన్) ను విక్రయిస్తుండగా, గ్రేడ్ 2 ఉత్పత్తిని స్థానికంగా అమ్ముతున్నారు. రైతులకు ఎఫ్‌పిఓలో తక్కువ ధరకు విత్తనాలు లభిస్తున్నప్పటికీ, అవగాహన లేకపోవడంతో మార్కెట్‌లో ఎక్కువ ధరకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయంపై ఎఫ్‌పిఓ మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.



తదుపరి నిమ్మనపల్లె ఎఫ్‌పిఓ , కురబలకోట ఎఫ్‌పిఓలను సందర్శించి బోర్డు సభ్యులతో చర్చించారు. రైతుల కొరకు అందజేస్తున్న సేవలు, commons.com యాప్ వినియోగం, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చ జరిగింది. బోర్డు సభ్యులతో వారి ఎఫ్‌పిఓ సేవలు, సవాళ్లు, మరియు అభివృద్ధి పథకాల గురించి చర్చించడం జరిగింది. ఎఫ్‌పిఓ నెలవారీ ఖర్చు సుమారు రూ.60,000 కాగా, ఆదాయం తక్కువగా ఉండటంతో గత నెలలో రూ.20,000 నష్టం వచ్చింది.

**అదనపు పరిశీలనలు**

- ఐటి రిటర్న్స్ సమర్పించకపోవడం ... ఆ అవగాహన లోపం.
- అక్టోబర్ నుండి లావాదేవీలను సక్రమంగా నమోదు చేయకపోవడం.

■

# రాయలసీమ నీటి ప్రాజెక్ట్‌లో సర్వే తీరుతెన్నులు

– జి ఆర్ అమరేంద్ర

**ఏ**పి మాస్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న 'రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్'లో బేస్‌లైన్ సర్వే జరుగుతున్నది. ఆ సర్వే తీరుతెన్నుల గురించి సర్వేలో పాల్గొంటున్న ఒక రైతు మిత్ర అనుభవాలను స్వయంగా ఆమె మాటలలోనే తెలుసుకుందాం.

'**నా** పేరు మూడె కవిత, తెట్టు పంచాయతీ, కురబలకోట మండలంలో 'రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్'లో రైతు మిత్రగా పని చేస్తున్నాను. నేను పని చేస్తున్న గ్రామాలలో బేస్ లైన్ సర్వే చేయటానికి ముందు గ్రామస్థులతో చర్చించడానికి, గ్రామ వనరులు, పంటలు గురించి తెలుసు కోవటానికి , గ్రామ సమావేశం ఏర్పాటుచేసి ప్రాజెక్టు గురించి మాట్లాడటానికి ఆ గ్రామాలకు రెండు మూడు సార్లు వెళ్ళడం జరిగింది.



**కుటుంబ ప్రాథమిక సర్వే :** గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని సర్వే చేయడం జరిగింది, సర్వే ఉద్దేశాలు వివరించిన తరువాత విషయ సేకరణ చేయడం జరిగింది. ఈ సర్వేలో ప్రధాన వృత్తి, భూమి, పశు సంపద, సంఘాలలో సభ్యత్వం, నీటి పారుదల వివరాలు సేకరించడం జరిగింది.

**ప్రాజెక్టుకు అన్వయించుకోవడం:**

1. గ్రామంలో ఎన్ని కుటుంబాలకు భూమి వుందో తెలియడం వలన ప్రాజెక్టులో భాగస్వామ్య కుటుంబాల సంఖ్య తెలుస్తుంది.
2. గ్రామంలో ఎన్ని కుటుం బాలకు నీటి పారుదల అవకాశాలు వున్నాయో, మెట్ట భూమి ఉన్నదో తెలియడం వలన సంబంధిత ప్రణాళికలో భాగస్వామ్యం చేయవచ్చు.



3. పశు సంపద ఉన్నదో లేదో తెలియడం వలన ప్రకృతి వ్యవసాయం ప్రణాళికలో మరియు పశుసంపద సర్వే కుటుంబాల సంఖ్య తెలుస్తుంది.
4. ఎందరు ఒంటరి మహిళలు వున్నారో, ఎందరు మహిళలు కుటుంబానికి నాయకత్వం వహిస్తున్నారో తెలుస్తుంది.

5. పెరటి తోటలు ఎన్ని కుటుంబాలకు వున్నాయో తెలియటం వలన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటల పెంపకానికి ప్రణాళిక చేయవచ్చు.

**పశు సంపద సర్వే :** ఈ సర్వేలో ఎన్ని కుటుంబా లకు ఏ ఏ రకాలైన పశువులు ఎన్ని వున్నాయో, ఎంత పొలంలో గడ్డి పెంపకం వున్నదో, ఎన్ని నెలలకు సరిపోతుందో, ఎంత కాలం గడ్డి కొరత వుంటుందో తెలుస్తుంది.

**ప్రాజెక్టుకు అన్వయించు కోవడం :** పశు సంపద వున్న కుటుంబాలను ముందుగ ప్రకృతి వ్యవసాయంలోకి తీసికొని రావటానికి ప్రణాళిక చేస్తాము.

**ఈ పి అర్ ఏ సర్వే :** ఈ సర్వే వలన క్రింది విషయాలు తెలుస్తాయి:

**భూమి వినియోగం :** గ్రామంలో వున్న వివిధ రకాలైన భూమి వినియోగం గురించి తెలుస్తుంది. వ్యవసాయ భూమి, బీడు భూములు, గృహాలు, రోడ్లు, నీటి వనరుల వివరాలు

**నేల రకాలు :** బంక మట్టి, ఎర్ర నేలలు , అల్లువియల్ నేలలు, ఇతర రకాల నేలల విస్తీర్ణం తెలుస్తుంది.

**పంట పద్ధతి :** ప్రస్తుతం సాగు చేస్తున్న భూమి ఏక పంట, మిశ్రమ

(మిగతా 22 వ పేజీలో ...)

ఒంటరిగా కుంగిపోతే ప్రతి చిన్న సమస్య కొండంత , సరైనవారితో పంచుకుంటే గురిగింజంత

# లక్ష మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

పేదింటి మహిళల స్వయం ఉపాధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఎం ఎస్ ఎం ఈ లు మొదలు అన్ని రకాల ఉపాధి అవకాశాలను వారి ముంగిటికే తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా అందించాలని తాజాగా నిర్ణయించింది. వారికి శిక్షణ కూడా ఇవ్వనుంది.

2024-25 సంవత్సరానికి బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన లక్ష మంది పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేయనుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరిస్తారు. మరో 10 రోజుల్లో శిక్షణ కేంద్రాలు ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. శిక్షణ ఇచ్చేందుకు గుత్తేదారుల ఎంపిక కూడా పూర్తయింది. ఎస్సీలకు కూడా ఇదే తరహాలో ఉచితంగా త్వరలో కుట్టుమిషన్లు అందించనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి దరఖాస్తులు స్వీకరిస్తే భారీగా లబ్ధిదారులు ఉండే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల తొలి విడతగా 26 జిల్లాల పరిధిలోని 60 నియోజకవర్గాల్లో ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ పథకాన్ని చేపట్టాలని నిర్ణయించింది.

వచ్చే ఏడాది మరో 60 నియోజకవర్గాలు, ఆ తర్వాత మిగిలిన వాటిలో ఈ కార్యక్రమాన్ని అమలు జరపనున్నారు. తొలి విడతగా బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల నుంచి నియోజక వర్గానికి 2 వేల నుంచి 3 వేల మంది అర్హులను గుర్తిస్తారు. ఇంతకంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే వాటిని తదుపరి విడతకు పరిగణిస్తారు.

2014-19 మధ్య అమలైన ఈ పథకంలో చాలా లోపాలున్నట్లు గుర్తించారు. దీంతో ఈ పథకాన్ని ఇప్పుడు మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో జిల్లా కేంద్రంలో మాత్రమే శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గంలో 6 నుంచి 8 శిక్షణ కేంద్రాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే 40 శాతం మేర శిక్షణ కేంద్రాలను గుర్తించారు. ఒక్కో కేంద్రంలో 30 నుంచి 50 మందికి శిక్షణ ఇస్తారు. కనీసం 70 శాతం హాజరు ఉన్న వారికే ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తారు. హాజరు నమోదుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు.

**ఆధునిక పనిముట్లు అందించే 'ఆదరణ'**

కుల వృత్తులు చేసుకునే వారికి ఆదరణ పథకం కింద ఆధునిక పనిముట్లు అందించనున్నారు. రాష్ట్రంలో కల్లు గీత కార్మికులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, గొర్రెల కాపరులకు, వడ్డెర, భవన నిర్మాణ కార్మికులు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలరింగ్ చేసుకునే వాళ్ళకి, పాల వ్యాపారం చేసుకునే వాళ్ళకి, ఎలక్ట్రీషియన్స్ ఇలా కొన్ని లక్షల మందికి మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

**ప్రాసెసింగ్ యంత్రాలపై 45 శాతం రాయితీ**

ఆహారశుద్ధి విధానంలో భాగంగా సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ట్రాన్స్ జెండర్, విభిన్న ప్రతిభావంతులైన మహిళలకు మూలధన పెట్టుబడిలో ప్లాంటు, యంత్రాలపై 45% రాయితీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గతంలో ఇది 35% ఉండగా.. దీన్ని 45శాతానికి పెంచారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్తు టారిఫ్‌లోనూ ప్రోత్సాహకాలు కల్పించారు.

**చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు 25 లక్షల రాయితీ**

కొత్తగా సూక్ష్మ, చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసే ఎస్సీ, ఎస్టీలకు భూమి విలువలో 75% రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గరిష్ఠంగా రూ. 25 లక్షల వరకు రాయితీ అందిస్తారు. ■

# మహిళా లోకానికి హక్కులు, సమానత్వం, సాధికారత !

## బాలికలతో సహా మహిళలందరికీ : ఇదీ ఈ ఏడాది మహిళా దినోత్సవ నినాదం



ప్రపంచ మహిళాలోకానికి కొత్త ఆశలను రేకెత్తిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మళ్ళీ వచ్చింది. మహిళా సంపూర్ణ సాధికారత దిశగా అంతర్జాతీయ స్థాయిలో నిరంతరాయంగా సాగుతున్న ప్రస్థానం, ప్రతి ఏటా మార్చి 8 వ తేదీతో మరో కొత్తదనం సంతరించుకుని, మరో కొత్త మైలురాయిని చేరుకుని, నవ్యభావనలతో, ఉద్యమ స్ఫూర్తితో, చేరుకోవలసిన గమ్యానికి మరింత చేరువయ్యే మార్గాన్ని నిర్దేశించుకుని, మరింత దృఢమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తుంటుంది.

ప్రపంచ దేశాల సంఘటిత వేదిక అయిన 'ఐక్యరాజ్య సమితి' ప్రతి ఏటా మహిళా దినోత్సవానికి సరికొత్త మార్గ దర్శనం చేస్తూ, ఏడాది పొడవునా చేపట్టవలసిన కార్యక్రమ ప్రణాళికను ప్రకటించడం ఆనవాయితీ. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఐక్యరాజ్య సమితి 2025 వ సంవత్సరానికి మహిళా దినోత్సవ మహదాశయాన్ని ప్రకటించింది.

'అందరు మహిళలకు, బాలికలకు: హక్కులు, సమానత్వం, సాధికారత ' (ఫర్ ఆల్ విమెన్ అండ్ గర్ల్స్ : రైట్స్, ఈక్వాలిటీ, ఎంపవర్‌మెంట్) అనే నినాదమే ఆ మహత్తర సంకల్పం! ప్రపంచ వ్యాప్తంగా మహిళల స్థితిపై ఐక్యరాజ్య సమితి 68 వ కమిషన్ ప్రకటించిన ఈ కార్యా చరణ ప్రణాళిక మహిళలకు, బాలికలకు అంతటా మరింత మెరుగైన ఆర్థిక సహభాస్వామ్య మార్గాలను అన్వేషిస్తుంది.

**కార్యాచరణ వేగం పెంచండి**

ఐక్యరాజ్య సమితి బాటలోనే ' ఇంటర్నేషనల్ విమెన్స్ డే (ఐ డబ్ల్యు డి) అనే సంస్థ కూడా ప్రతి ఏటా మహిళా దినోత్సవ నినాదాన్ని ప్రకటిస్తుంటుంది. 2025వ సంవత్సరా నికి ఐ డబ్ల్యు డి నినాదం 'కార్యాచరణ వేగం పెంచండి' (యాక్సిలరేట్ యాక్షన్) అనేది. లైంగిక సమానత్వ సాధన కోసం నిర్ణయాత్మకమైన చర్యలు ముఖ్యమని, ఈ సామాజిక వ్యవస్థలో వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మహిళలు ఎదుర్కొంటున్న అవరోధాలను, అసమానతలను అధిగమించ డానికి కార్యాచరణ వేగం పెరగవలసిన అవసరం ఎంతైనా

వుందని తన మహిళా దినోత్సవ నినాదానికి ఐ డబ్ల్యు డి భాష్యం చెప్పింది.

**మహిళా దినోత్సవం మొదలైన తీరు...**

ప్రపంచ స్థాయిలో మహిళా ఉద్యమాలకు 110 సంవత్సరాలకు పైగా చరిత్ర వున్నది. 1909 ఫిబ్రవరి 28 వ తేదీన ఉత్తర అమెరికాలో మహిళలకు ఓటు హక్కు కోసం పిడికిలి బిగించిన మహిళా ప్రతిఘటన కాలక్రమంలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవానికి దారి తీసిన తొలి అడుగు. అయితే అది కేవలం ఉత్తర అమెరికాకే పరిమిత మైంది. అనంతరం 1911 మార్చి 19న ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలు ఉద్యోగినులు, శ్రామిక మహిళల సమ్మె, నిరసనలతో హోరెత్తిపోయాయి.

మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై ఆ రోజున జర్మనీకి చెందిన సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్, రష్యా విప్లవోద్యమ, మహిళా ఉద్యమ ప్రముఖురాలు అలెగ్జాండర్ కొలంతయ్ నేతృత్వంలో జర్మనీ, ఆస్ట్రియా, డెన్మార్క్, స్విట్జెర్లాండ్, ఇతర ఐరోపా దేశాల సోషలిస్ట్ మహిళలు పెద్ద సంఖ్యలో సమ్మెలు, పాద యాత్రలు జరిపారు. అప్పటినుంచి ప్రతి ఏటా మార్చి 19న మహిళా దినోత్సవాన్ని పాటిస్తూ వచ్చారు.

క్రమంగా ఉద్యోగినుల సమస్యలే కాకుండా శాంతియుత సహజీవనం, మహిళల హక్కులు కూడా ఈ ఉద్యమంలో భాగమైనాయి. 1915లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేయాలంటూ జెట్కిన్ స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఒక ప్రదర్శన నిర్వహించారు. యుద్ధానికి సంబంధించిన ఉభయ శిబిరాల మహిళలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

అనేక దేశాలలో ఒకే రోజున ఉద్యమించిన మహిళల చైతన్య శక్తికి, సంఘటిత కార్యాచరణకు సంకేతంగా 1911 మార్చి 19వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గణుతికెక్కింది. 1975 నుంచి ఐక్యరాజ్య సమితి ఈ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నది.

**గద్దె దిగిన చక్రవర్తి**

ఇక ఇప్పటి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి తొలి మెట్టుగా అత్యంత ప్రసిద్ధమైనది 1917 మార్చి 8న రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ఆహారం, శాంతి కోసం రష్యన్ మహిళలు జరిపిన మహా ప్రదర్శన! జెట్కిన్, కొలంతాయ్ లు ఇరువురూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సమ్మె ఆ నగర మంతటా ఐదురోజులపాటు అల్లర్లకు, దాడులకు దారితీసింది. ఈ అల్లర్ల పర్యవసానంగా రష్యా చక్రవర్తి జార్ నికొలస్-2 పదవి నుంచి వైదొలగాడు.

ఈ విధంగా నాటి మహిళా మహోద్యమం ఒక చక్రవర్తిని పదవీచ్యుతుని చేసి, 'ఫిబ్రవరి విప్లవం' గా చరిత్రలో నిలిచిపోయింది. (1917 వరకు రష్యా జూలియస్ క్యాలెండర్‌ను అనుసరించేది. ఆ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమం జరిగింది ఫిబ్రవరి 24-28 తేదీలలో. అందుకే అది ఫిబ్రవరి విప్లవమని పేరు పొందింది.

1918 నుంచి రష్యాలో ప్రస్తుతం అనుసరిస్తున్న గ్రెగేరియన్ క్యాలెండర్ వాడుకలోకి వచ్చింది. గ్రెగేరియన్ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమ తేదీలు మార్చి 8-12 అవుతాయి.

ఆ తర్వాత లెనిన్ నాయకత్వంలో రష్యాలో ఏర్పడిన తొలి సోవియెట్ ప్రభుత్వంలో కొలంతాయ్ మంత్రి అయ్యారు. ఆమె పట్టుపట్టి 'మహిళల మహా పోరాటానికి గుర్తు' గా మార్చి 8వ తేదీని అధికార సెలవుదినంగా ప్రకటింపజేశారు ■

**బీజింగ్ డిక్లరేషన్‌కు 30 ఏళ్ళు !**

ఈ ఏడాది మహిళా దినోత్సవానికి ఒక ప్రత్యేకత వుంది. లైంగిక సమానత్వ సాధనకు ఒక స్ఫూర్తిమంతమైన ప్రాతిపదికను, కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తూ, ఐక్యరాజ్య సమితి నేతృత్వంలో ఈ మహోద్యమంలో చిరస్థాయిగా నిలిచిపోయే ఒక మైలురాయివంటి 'బీజింగ్ డిక్లరేషన్' రూపొంది ఈ ఏడాదికి 30 ఏళ్ళు పూర్తవుతుండడం ఆ ప్రత్యేకత!

**ఓడించడం కాదు, మనసులను గెలుచుకో ;హేళనగా నవ్వడం కాదు అందరితో ఆనందంగా నవ్వుకో**

# సాధికారత సాధన దిశగా నడిపించే చైతన్యపథం!

ఐక్యరాజ్య సమితి 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికి 1996 నుంచి ఏడాదికొక కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తున్నది. లక్ష్యసాధన దిశగా ఏడాదికి ఒక నినాదాన్ని, కార్యాచరణ పథాన్ని సమితి నిర్దేశిస్తున్నది. ఆ కార్యాచరణ ప్రణాళికామాలికను చూద్దాం!

1996: గతాన్ని గౌరవిస్తూ, భవిష్యత్తుకు ప్రణాళిక
1997: మహిళలు... శాంతి చర్చలు
1998: మహిళలు... మానవ హక్కులు
1999: మహిళలపట్ల హింసకు తావులేని ప్రపంచం
2000: శాంతికోసం మహిళలు ఏకంకావడం
2001: శాంతి, ఘర్షణలపై మహిళల అజమాయిషీ
2002: నేటి ఆఫ్ఘన్ మహిళ ... వాస్తవాలు, అవకాశాలు
2003: లైంగిక సమానత్వం ... సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు
2004: మహిళలు ... హెచ్ ఐ వి, ఎయిడ్స్
2005: లైంగిక సమానత్వం, భద్రత కలిగిన భవిష్యత్‌ను రూపొందించడం
2006: మహిళలు ... నిర్ణయాత్మక పాత్ర
2007: మహిళలపై హింసకు పాల్పడే వారిని శిక్షించక పోవడాన్ని తుదముట్టించాలి
2008: పెట్టుబడి వనరుగా మహిళలు, బాలికలు
2009: స్త్రీ, పురుషులు కలసికట్టుగా మహిళలపైన, బాలికలపైన హింసను అరికట్టడం
2010: సమాన హక్కులు, సమానావకాశాలు, అందరి ప్రగతి
2011: విద్య, శిక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో సమానమైన అవకాశాలు ; మహిళలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పనకు మార్గనిర్దేశం
2012: గ్రామీణ మహిళా సాధికారత ...పేదరికానికి, ఆకలికి తావులేకుండా చేయడం
2013: వాగ్దానం వాగ్దానమే ... ఇది మహిళలపై హింసను తుదముట్టించే కార్యాచరణకు సమయం
2014: మహిళలకు సమానత్వం, అందరికీ ప్రగతి
2015: మహిళా సాధికారతే మానవాళి సాధికారత, సాధిద్దాం
2016: 2030నాటికి భూగోళం చెరిసగం(50-50): లైంగిక సమానత్వ సాధన కోసం ఆ దిశగా మరింత కృషి
2017: మారుతున్న పని ప్రపంచంలో మహిళ: 2030 నాటికి భూగోళం చెరిసగం (50-50)'
2018: ఇదే సమయం: గ్రామీణ, పట్టణ క్రియాశీల కార్యకర్తలు మహిళల జీవితాలలో మార్పు తెస్తున్నారు
2019: 'సమానంగా ఆలోచించు, చురుకుగా నిర్మించు, మార్పు కోసం వినూత్న మార్గాన్ని అనుసరించు'.
2020 : మహిళల హక్కులను సాధించే సమానత్వ తరం!
2021: కోవిడ్ 19 ప్రపంచంలో సమాన భవిష్యత్తును సాధిస్తున్న మహిళా నాయకత్వం
2022 : రేపటి సుస్థిరాభివృద్ధికోసం నేడు స్త్రీ, పురుష సమానత్వం పాటిద్దాం
2023 : 'అందరికీ డిజిటల్ పరిజ్ఞానం: లైంగిక సమానత్వం కోసం నవీకరణలు, సాంకేతికత'
2024 : 'ఆమె మన సహభాగస్వామి! మహిళలకు సహకరిద్దాం, ప్రగతిని పరుగులు పెట్టిద్దాం !
2025: అందరు మహిళలకు, బాలికలకు: హక్కులు, సమానత్వం, సాధికారత ■

### మరో 'ప్రపంచ మహిళా మహాసభ ఎప్పుడు?

➪ మొదటి ప్రపంచ మహిళా మహాసభ: 1975 (మెక్సికో)
రెండవ ప్రపంచ మహిళా మహాసభ : 1980 (కోపెన్ హగన్)
➪ మూడవప్రపంచ మహిళామహాసభ:1985 (నైరోబి)
➪ నాల్గవ ప్రపంచ మహిళామహాసభ:1995 (బీజింగ్)
30 ఏళ్ళయినా ఐదవ మహాసభ అసలు జరగనే లేదు. ■

కేవలం శరీర బలమో, మనో బలమో కాదు , నీ సత్తాను చాటేది నిరంతర కృషి

# మద్యంపై మహిళల సంఘటిత పోరాటం!

**ఊ**రుకు పట్టిన 'మత్తు' వదిలించడానికి మహిళా లోకం కదిలింది. యువకుడి మరణానికి కారణమైన మద్యాన్ని... తమ గ్రామం నుంచి తరిమేయాలని సంకల్పించింది. బెల్టు షాపులను మూయించి... మద్యం అమ్మినా... తాగినా జరిమానా వేయాలని నిర్ణయించింది. ఒత్తిడులు ఎదురైనా... బెదిరింపులు వచ్చినా... మద్య నిషేధాన్ని కొనసాగించి తీరతామని... మరే కుటుంబాన్నీ అనాథ కానివ్వమని ప్రతిజ్ఞ పూనింది. ఆంధ్రజ్యోతి 'నవ్య'లో ప్రచురితమైన ఈ నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామ మహిళల మహాపోరాట ప్రత్యేక కథనం ఆంధ్రజ్యోతి సౌజన్యంతో మహిళా సాధికారత కోసం .....

ఇది మహాసంగ్రామం. ఊరు కోసం... ఊళ్లోని ప్రతి ఒక్కరి బాగు కోసం ఏపూరు మహిళలు భుజానికెత్తుకున్న ఉద్యమం... మద్య నిషేధం. ఏపూరుకు చెందిన మినీ లారీ డ్రైవర్ కూరాకుల ధనుంజయ ఇటీవల గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ధనుంజయకు భార్య శిల్ప, మూడేళ్ల కుమారుడు హర్షిత్, ఏడాదిన్నర కూతురు తేజస్వీ ఉన్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత కూడా అతడిదే.

డ్రైవర్‌గా రోజంతా కష్టపడి సంపాదిస్తేనే ధనుంజయ కుటుంబానికి పూట గడిచేది. అలాంటి కుటుంబం ధనుంజయ మరణంతో దిక్కులేని దయింది. వారి పరిస్థితి గ్రామస్తులను కలచి వేసింది. ఆ కుటుంబానికి వచ్చిన కష్టం... తమకొచ్చినట్లేనని గ్రామం లోని మహిళలంతా భావించారు. ఆ బాధను పంచుకోవా లని, ఈ మరణానికి కారణమైన మద్యం దెయ్యాన్ని గ్రామం నుంచి తరిమేయాలని కంకణ బద్ధులయ్యారు

గ్రామంలో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవ డానికి, నైతికంగా పతనం కావడానికి కారణమైన మద్యాన్ని గ్రామం నుంచి పారదోలాలని సంకల్పించారు. ధనుంజయ అంత్యక్రియలు ముగిసేలోగానే మహిళలంతా సమావేశమై గ్రామంలో మద్య నిషేధం విధించారు. బెల్టు దుకాణాలు ఎత్తి వేయాలని తీర్మానించారు. మద్యం అమ్మితే రూ.లక్ష, మద్యం సేవిస్తే రూ. 20 వేల జరిమానా వేయాలని నిర్ణయిం చారు. అంతేకాదు... మద్యం అమ్మినవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా కూడా ఇస్తామని ప్రకటించారు. తామంతా కలిసి తీసుకున్న నిర్ణయానికి గ్రామంలోని మగవారంతా సహకరించాలని కోరారు. గత కొన్ని రోజులుగా మద్య నిషేధం అమలు చేస్తుండడంతో గ్రామంలో కొత్త వాతావరణం నెలకొంది.

**'కొనసాగించి తీరతాం..'**

రాజకీయ, ఇతర కారణాలతో ఎవరూ బెల్టుషాపు నిర్వాహకులను వెనకేసుకు రావద్దని మహిళలు గ్రామస్తులు అందరినీ హెచ్చరించారు. ప్రతి మహిళ తన ఇంట్లో ఎవరూ తాగకుండా చూడాలని సంకల్పించుకున్నారు. తమ భర్తలు, పిల్లలు మద్యం తాగవద్దని తాము చెప్పడమే కాకుండా, పిల్లలతోనూ చెప్పిస్తున్నారు. మహిళలే గ్రామంలో మద్య నిషేధం కోసం అందరినీ చైతన్య పరుస్తున్నారు. దాన్ని పక్కాగా అమలు చేసే బాధ్యత కూడా వారే తీసుకున్నారు. ప్రతి మహిళా తన ఇంటి నుంచే మార్పు రావాలని బలంగా సంకల్పించుకున్నారు. తమ ఇళ్లల్లోని మగవారిని మద్యం జోలికి వెళ్లకుండా నచ్చజెబుతున్నారు. ఆటంకాలు ఎన్ని ఎదురైనా... బెదిరింపులు వచ్చినా గ్రామంలో మద్య నిషేధం కొనసాగించి తీరతామని ప్రతిజ్ఞ చేశారు.

**ఒక్క సీసా కూడా రానిచ్చేదిలేదు...**

గ్రామంలో 650 కుటుంబాలతో దాదాపు 2500 జనాభా ఉంది. ఈ గ్రామంలో 300 పైచిలుకు మంది డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మరోవైపున గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమలో మరో 150 మంది వరకు పని చేస్తున్నారు. కేవలం వ్యవసాయం, కులవృత్తులే కాకుండా ప్రతి కుటుంబానికి అదనంగా పని చేసే వనరుల ద్వారా అదనపు సంపాదన వస్తుండడంతో తేలిగ్గా మద్యం సేవించే

ఎవరి జీవితమూ పరిపూర్ణం కాదు, కాని ప్రతి క్షణాన్ని మంచిగా జీవించగలిగితే అది సంపూర్ణమే

దుకు అలవాటు పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయనేది గ్రామస్తుల మాట.

స్థానికంగా ఉన్న 13 బెల్టు షాపులను గుర్తించిన మహిళలు... వారందరినీ మద్యం అమ్మకుండా కట్టడి చేశారు. మరో వైపు గ్రామ సమీపంలో దాబాల ముసుగులో ఉన్న అక్రమ సిట్టింగులను కూడా నిషేధించారు. ప్రస్తుతం గ్రామంలో ఒక్క మద్యం సీసా కూడా కనిపించడం లేదు. బెల్టు షాపుల నిర్వాహకులు మహిళలపై రకరకాలుగా ఒత్తిళ్ళు తెస్తున్నారు. కానీ వాటికి తాము లొంగేది లేదని, ఊళ్లోకి మద్యం సీసా రానిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. వారి దృఢ సంకల్పానికి మహిళా లోకం జేజేలు పలుకుతోంది.

**మంచి నిర్ణయం**

"మద్య నిషేధం తర్వాత ఊళ్లో సాయంత్రమయ్యాక ఎవరింటికి వారు వెళుతున్నారు. అన్ని కుటుంబాలూ ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిద్రిస్తున్నాయి. ధనుంజయ మరణంతో ఊళ్లో కదలిక వచ్చింది. మహిళలందరూ కలిసి తీసుకున్న మద్య నిషేధ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి. ఊళ్లో మద్యం విక్రయించకుండా అందరూ సహకరించాలి. వినకపోతే పోలీసులు జోక్యం చేసుకోవాలి" అంటారు గ్రామస్తుడైన వృద్ధుడు వీరయ్య యాదవ్.

**వెనక్కి తగ్గేది లేదు...**

'మా ఊళ్లో మద్య నిషేధం కొనసాగించడానికి ఎంతవరకైనా పోరాడతాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదు. ఊళ్లో మళ్లీ బెల్టు షాపులు ఏర్పాటు చేసినా, అక్రమ మద్యం సిట్టింగులు కొనసాగించినా జరిమానాలు విధించడమే కాదు... వారిని పోలీసులకు పట్టిస్తాం.

ఈ ఉద్యమానికి మా కుటుంబాల నుంచి కూడా సంపూర్ణ మద్దతు లభించింది. మా నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇవన్నీ చూశాక గ్రామంలో మద్య నిషేధాన్ని అమలు చేయగలుగుతామన్న నమ్మకం కలిగింది" అంటారు ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన అనూరాధ, తదితర మహిళలు. ■

## సీమ నీటి ప్రాజెక్ట్‌లో సర్వే తీరుతెన్నులు

(16 వ పేజీ తరువాయి ...)

పంట ఎంత విస్తీర్ణాలలో వున్నది తెలుస్తుంది.

**బీడు భూముల వివరాలు :** గ్రామంలో బీడు భూములు ఎంత విస్తీర్ణంలో వున్నాయో, ఎన్ని సంవత్సరాలుగా వున్నాయో తెలుస్తుంది.

**నీటి వనరుల వివరాలు :** బావులు, బోర్లు , వరాధార వ్యవసాయం లాంటి వివిధ రకాలైన నీటి వనరుల వివరాలు వ్యవసాయంలో వాడకం తెలుస్తుంది.

**పంటల వివరాలు, సాగు పద్ధతులు :** గ్రామంలో ఏ ఏ పంటలు వేస్తున్నారో, ఏ పద్ధతిలో (రసాయన వ్యవసాయం, జిఏపి, యన్ పి యం) సాగు చేస్తున్నారో తెలుస్తుంది.

**ప్రాజెక్టుకు అన్వయించుకోవడం :**

- సాగులోలేని బీడు భూములను సాగులోనికి తెచ్చుకోవడానికి ఉపయోగపడే సమాచారం.
- ఏక పంట నుండి బహుళ పంటలకు తెచ్చే ప్రణాళికకు
- రసాయన వ్యవసాయం నుండి ప్రకృతి వ్యవసాయానికి మళ్ళించే ప్రణాళిక చేయడానికి ఉపయోగపడుతుంది

నేను పనిచేస్తున్నగ్రామాలలో నేను స్వయంగా సర్వేలో పాల్గొనడం వలన, గ్రామ వనరులు, వరాధార వ్యవసాయం , కుటుంబ వ్యవసాయం, పశుసంపద వివరాలు తెలియడం వలన ఏ కుటుంబంతో ఏ విధంగా పని చేయాలో, ఏ సీజన్‌లో పనిచేయాలో తెలుసుకోగలిగాను'.

## మిర్చి రైతులకు శుభవార్త !

మిర్చి రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. భారత ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం (యంఐఎస్) ద్వారా మిర్చి క్వింటాకు రూ. 11,781 మద్దతు ధరగా కేంద్రం నిర్ణయించిందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అందులో 25% ఉత్పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. ■

సమస్యలు నీ సంతోషాన్ని దూరం చేసే లోగా నీవే సమస్యలను దూరం చేసుకోగలగాలి

# ప్రకృతి సాగులో ఆంధ్రప్రదేశ్‌కు అవార్డుల పంట




ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్ర రైతులకు అవార్డుల పంట పండింది. జాతీయ స్థాయి 15 అవార్డుల్లో ఏడు అవార్డులు దక్కించుకున్నారు. నాగపూర్‌లో ఈనెల 23, 24 తేదీల్లో సేంద్రీయ వ్యవసాయంపై జాతీయ సదస్సు నిర్వహించారు.

జాతీయ సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ కేంద్రం, భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ఎం.నాగేంద్ర (అనంతపురం), కె.శ్రీనివాస్(విజయనగరం), ఆర్.రజిని (శ్రీసత్యసాయి), ఎం.సత్యనారాయణ(తిరుపతి), జి.అశ్వని(కోనసీమ), జి.వెలుగొండయ్య(ప్రకాశం), పుల్లయ్య(కర్నూలు) అవార్డులు దక్కించుకున్నారు. అదనంగా ఏపీ రైతు సాధికార సంస్థ ఉత్తమ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అవార్డు గెలుచుకుంది

**సన్నరకాల వరి సాగుకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో సన్నరకాల వరి సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముతక రకాలు, గింజ లావు రకాలు అమ్ముడుపోక, ఎగుమతి కాక, పౌరసరఫరాల ద్వారా పంపిణీ చేసినా ప్రజలు తినక సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సన్నరకాల వరి సాగు, ఉత్పత్తిని పెంచే ప్రణాళికలో భాగంగా సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, పౌరసరఫరాల సంస్థ ఎండీ మనజీర్ జిలానీ, వ్యవసాయ విశ్వవిద్యాలయ రీసెర్చ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ మండలాల్లో పండుతున్న వరి రకాలు, సాగు విస్తీర్ణం, ఉత్పత్తిపై వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఖరీఫ్‌లో ఎంటీయూ- 1121, 1061,1064, పీఆర్126, రబీలో ఎంటీయూ-1121, 1153, పీఆర్ 126 రకాల విస్తీర్ణాన్ని తగ్గించాలని, ఈ రకం ధాన్యసేకరణను నిలిపివేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. వీటికి ప్రత్యామ్నాయ రకాలను సూచించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కోరారు.

సన్న రకాలైన బీపీటీ-5204, 3291, ఆర్ఎన్ఆర్ 15049, ఎంటీయూ 1224, ఆర్‌జీఎల్ 2537, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్‌డీఎల్ఆర్7, పీఎల్‌ఏ 1100, జేజీఎల్ 384, హెచ్ఎంటీ, జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

భయంతో ఎక్కడికని పారిపోతావ్ ? ఆ భయం వున్నదే నీ గుండెలో

# ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా



**ఢి**ల్లీ తొమ్మిదో ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణం స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

పలువురు సీనియర్ నేతల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ రేఖా గుప్తా వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గు చూపింది. షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన 50 ఏళ్ల రేఖా గుప్తాకు దిల్లీ సీఎం పగ్గాలు అప్పగించింది.

ఏబీవీపీ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రేఖా గుప్తా బీజేపీలో పలు విభాగాల్లో క్రియాశీలంగా పని చేశారు. దిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా కూడా గతంలో సేవలందించారు. రేఖా గుప్తా దిల్లీకి నాలుగో మహిళా సీఎంగా సేవలందించనున్నారు. గతంలో సుష్మాస్వరాజ్ (బీజేపీ), షీలా దీక్షిత్ (కాంగ్రెస్), ఆతిశీ (ఆప్) ముఖ్యమంత్రులుగా పనిచేశారు.

జులై 19, 1974లో హరియాణాలోని జుల్నాలో జన్మించిన రేఖా గుప్తా, చిన్న వయసులోనే ఆరెస్సెస్ భావజాలం వైపు ఆకర్షితురాలయ్యారు. దిల్లీ వర్సిటీలో విద్యనభ్యసించారు. ఆ సమయంలోనే తన రాజకీయ జీవితానికి పునాదులు వేసుకున్నారు. 1996లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. తద్వారా క్రియాశీల రాజకీయాల వైపు అడుగులు వేశారు.

విద్యార్థుల సంక్షేమం, యువత సాధికారత అంశాలపై దృష్టిసారించి పని చేశారు. ఈ క్రమంలోనే 2007, 2012లలో రెండుసార్లు ఉత్తరి పీతమ్‌పుర నుంచి మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. దిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా, బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఇలా పార్టీలో వివిధ బాధ్యతల్లో పని చేశారు.

విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రేఖా గుప్తా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. పితంపుర, షాలీమార్ బాగ్ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి కోసం ఆమె ఎంతగానో కృషిచేశారు. రేఖా గుప్తాకు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉంది. అయితే ఆమె ఇప్పటివరకు ఎమ్మెల్యేగా, ఎంపీగా చేయకపోయినప్పటికీ ఢిల్లీ మేయర్‌గా పని చేసిన అనుభవం ఉంది. అంతే కాకుండా ఢిల్లీ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కూడా రేఖా గుప్తా రెండుస్తారు ఎన్నికయ్యారు. ఢిల్లీ పీఠంపురా నుంచి కౌన్సిలర్‌గా... ఆ తర్వాత మేయర్‌గా పని చేశారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా కూడా ఆమె పనిచేశారు.

ఎమ్మెల్యేగా... ప్రస్తుతం ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. షాలీమార్‌బాగ్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 2025లో అదే నియోజకవర్గం నుంచి బందనా కుమారిని 29వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు.

రేఖాగుప్తాను సీఎంగా ఎన్నుకోవడానికి ఆమె కుటుంబానికి సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) నేపథ్యం ఉండటం కూడా బాగా కలిసొచ్చింది అని చెబుతున్నారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించిన ఆమె ఆ తర్వాత బీజేపీలో చేరారు.

**కుటుంబ నేపథ్యం..**

ప్రస్తుతం రేఖా గుప్తా వయస్సు 50 ఏళ్లు. 1974లో హర్యానాలోని జింద్ జిల్లాలోని నంద్‌గఢ్ గ్రామంలో ఆమె జన్మించారు. ఆమె తండ్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అధికారిగా పని చేశారు. రేఖ కుటుంబం 1976లో ఢిల్లీకి మారింది. ■

నిన్ను పదేపదే వేధించే వారివల్ల నీ ఆత్మబలం పెరుగుతున్నట్టు, వారి బలం క్షీణిస్తున్నట్టు

# దున్నకుండా... కలుపు తీయకుండా... రసాయనాల్లేకుండా సాగు!

రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా వ్యవసాయం చేస్తున్నారంటే ఇప్పుడెవరూ ఆశ్చర్యపోవడం లేదు. కానీ.. ఎద్దులతోనో, ట్రాక్టరుతోనో దున్నే పనే లేకుండా ప్రకృతి వ్యవసాయం చేయొచ్చంటే నమ్మలేం. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన దివంగత రైతు శాస్త్రవేత్త రాజు టైటస్ మాత్రం 30 ఏళ్ళపాటు ఇలాగే వ్యవసాయం చేసి సత్ఫలితాలు సాధించారు. 'ప్రకృతి వ్యవసానుకబడినదో లేదా ప్రాచీన మైనదో కాదు. ఆధునికమైనది, వినూత్నమైనది అని రాజు టైటస్ రుజువు చేశారు' అని ఐసిఏఆర్ ప్రశంసించింది. ఆరేళ్ళం కన్ను మూసినా... ఆయన కృషి రైతులకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

మధ్యప్రదేశ్‌లోని హూషంగాబాద్‌కు చెందిన 'రాజు టైటస్' ప్రభుత్వోద్యోగి. అయినా కుటుంబ వారసత్వంగా వచ్చిన 13 ఎకరాల పొలాన్ని సాగు చేయటం మానలేదు. 70వ దశకంలో అందరిలానే ఆయనా 'హరిత విప్లవం' ఒరలో రసాయన ఎరువులు, కీటకనాశనులు వాడటం మొదలు పెట్టారు. మొదట్లో దిగుబడులు పెరిగి ఆదాయం వచ్చినా పదిహేనేళ్ళు తిరిగేసరికి పంట భూమి నిస్సార మయింది. దిగుబడులు తగ్గి నష్టాలు పాలై పొలం అమ్మేయా లని నిశ్చయించుకున్నాడు. ఇది జరిగింది 1984లో. రాజు నిర్ణయంతో తల్లి హతాశురాలయింది. గాంధేయవాదులు నడిపే స్వచ్ఛంద సంస్థ 'ఫ్రెండ్స్ రూరల్ సెంటర్' కార్యకర్త లతో ఆమె తన గోడు వెళ్ళబోసుకుంది. వారు ఆమె చెప్పిన దంతా విని జపాన్ దేశానికి చెందిన ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త మసనోబు ఫుకుఒకా రాసిన 'గడ్డిపరకతో విప్లవం' (వన్ స్ట్రా రివల్యూషన్) పుస్తకాన్నిచ్చి మీ సమస్యకు ఈ పుస్తకం పరిష్కారాన్ని చూపుతుందని చెప్పారు.

కలుపు తీయకుండా... దుక్కి దున్నకుండా... ఎరువులు వేయకుండా... పురుగు మందులు పిచికారీ వంటి పద్ధతుల అనుసరించకుండానే పంటలను సాగు చేసే పద్ధతుల గురించి ఫుకుఒకా ఆ పుస్తకంలో వివరించారు. ఈ పుస్తకాన్ని చదివిన రాజు తను సాగులో తను అనుసరిస్తున్న పద్ధతులు అనర్థహేతువులని అర్థం చేసుకున్నారు.

**అడ్డంకులను అధిగమించి...**

15 ఏళ్ళుగా రసాయన ఎరువులు వేస్తూ పంట భూమిని ధ్వంసం చేస్తున్నానని అర్థం చేసుకున్న రాజు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. 1985 నుంచి ఫుకుఒకా చెప్పిన పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేయటం మొదలుపెట్టారు. అప్పటినుంచి నేలను దున్నటం, ఎరువులు, పురుగుమందుల వాడకం ఆపేశారు. రకరకాల గడ్డి, చెట్ల విత్తనాలను పొలంలో వెదజల్లి అవి పెరిగాక కత్తిరించి ఆచ్ఛాదనగా వాడేవారు. దీనివల్ల వర్షపు నీరు బయటకు వెళ్ళకుండా పొలంలోనే ఇంకి... నేల గుల్లబారటంతో పాటు తేమను పట్టి ఉంచింది. తొలుత గ్రామస్తులు అవహేళన చేసినా అడ్డంకులను అధిగమించి రాజు ప్రకృతి సేద్యం దిశ వడివడిగా అడుగులు వేశారు.

**సోయా విత్తన బంతులు!**

అంకితభావంతో రాజు టైటస్ చేసిన కృషి ఫలితాన్ని ఇచ్చింది. 1988లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనటానికి ఇడియా వచ్చిన ఫుకుఒకా ప్రకృతి సేద్యం చేస్తున్న రాజు గురించి తెలుసుకొని ఆయన పొలాన్ని సందర్శించారు.

ఫుకుఒకా సలహాలు సూచనలను అనుసరించి రెట్టించిన ఉత్సాహంతో రాజు పని చేశారు. ఫుకుఒకా సూచన మేరకు పంటను విత్తుకోవటానికి బదులు.... ఒక పాలు సోయా విత్తనం, ఏడు పాళ్ళు మట్టి కలిపి క్రికెట్ బాల్ పరమాణంలో ఉండే 'విత్తన బంతుల'ను తయారు చేశారు. భార్య శాలిని సహకారంతో... అడుగుకో బంతి చొప్పున... పొలంలో వేశారు. దీనివల్ల మొలకెత్తి నప్పటి నుంచే మొక్కలు పోషకాలను, సూర్యరశ్మిని ఎక్కువగా గ్రహించి ఏపుగా ఎదిగాయి. ఆ ఏడాది దిగుబడి బావుండటంతో పాటు నాణ్యమైన పంట వచ్చింది.

సోయా మొక్కల మధ్య ఎత్తుగా పెరిగిన గడ్డిని కత్తిరించి

భూమిపైన ఆచ్ఛాదనగా వేశారు. దీనివల్ల పంటలకు హాని చేసే శత్రు పురుగులను ఇవి నిర్మూలిస్తాయి. దీనివల్ల రసాయనిక ఎరువులు, కీటకనాశనుల అవసరం తప్పుతుంది. ఇవి నేలలో చేసే బొరియల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. వేర్లు లోతుకంటా చొచ్చుకుపోయి తేమను పోషకాలను గ్రహిస్తాయి. నేల గుల్లబారి భూసారం పెరిగి మంచి పంట దిగుబడులు వస్తాయి. నేలను దున్నాల్సిన అవసరం లేకపోవటం వల్ల ట్రాక్టరు, ఎద్దుల కోసం అప్పు చేయాల్సిన అగత్యం తప్పింది.

రాజు తన పొలంలో నత్రజనిని స్థిరీకదుకు సుబాబుల్ చెట్లను సాగు చేశారు. దీనివల్ల యూరియా రూపంలో రసాయన ఎరువును అందించాల్సిన ఉండదంటారాయన. సుబాబుల్ ఆకులు మేకలకు మంచి మేతగా ఉపయోగ పడ్డాయి. ఈ చెట్ల కలపతో పాటు మేకల విక్రయం ద్వారా ఆదాయం లభిస్తోంది. ఆ విధంగా 30 ఏళ్ళకు పైగా పొలాన్ని దున్నకుండానే సమృద్ధిగా పంటలు పండిస్తూ పేరు పొందారు. వినియోగదారులు అడిగితేనే రైతులు పండిస్తారు!

వినియోగదారులు కూడ ఆరోగ్యకరమైన ఆహారం కోసం డిమాండ్ చేసినప్పుడే రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం మానేస్తారు. ఆరోగ్యకరమైన నేల ద్వారానే ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తి సాధ్యమనే విషయాన్ని గుర్తిస్తారు అనేవారు రాజు టైటస్. మన దేశంలో ప్రజలకు సోకుతున్న పలు జబ్బులకు మూలకారణం ఆహార పంటల సాగులో వాడుతున్న రసాయనాలు, వీటివల్ల తొలుత మధు మేహం సోకి పలు దీర్ఘ అనారోగ్యాలకు దారి తీస్తుంది. నాకు పక్షవాతం వచ్చింది, నా భార్య గుండె జబ్బు వ్యాధిగ్రస్తురాలు. మేం కోలుకోవటానికి ప్రకృతి సేద్యం పంట ఉత్పత్తులే కారణం అన్నారాయన.

మా కుటుంబ అవసరాల కోసం ప్రస్తుతం ఎకరా పొలంలో ధాన్యం, పండ్లు, పాలు, కూరగాయలను సాగు చేస్తున్నాం. ఖరీఫ్‌లో గోధుమ, వరి, మొక్కజొన్న, రబీలో పెసరను సాగు చేస్తున్నా రోజు రోజుకు వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులే ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. పుకుఒకా విధానంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ఈ సేద్యం మూలసూత్రాలను ఒంట బట్టించుకుంటే ఏ రైతైనా పొలాన్ని దున్నకుండానే సేద్యం చేయవచ్చు అంటారు రాజు టైటస్. ■

## ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు వర్క్ ఫ్రమ్ హోం విధానం : సి ఎం

**రా**ష్ట్రంలో మహిళలకు వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. స్టెమ్ కోర్సు మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం, సైన్స్ రంగంలో విజయాలు సాధిస్తున్న మహిళలకు అభినందనలు తెలిపారు.

స్టెమ్ కోర్సు రంగాల్లో వృద్ధి అవకాశాలను కల్పించేం దుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కొవిడ్ అనంతర పరిణామాలు, అందుబాటులో ఉన్న సాంకేతికత 'వర్క్ ఫ్రమ్ హోమ్' ప్రాముఖ్యతను పెంచాయని గుర్తు చేశారు. రిమోట్ వర్క్, కోవర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్క్ స్పేస్ వంటి కాన్సెప్ట్‌లు అనువైన ఉత్పాదక వాతావరణాన్ని సృష్టిస్తాయన్నారు. ఇవి వ్యాపారులు, ఉద్యోగులకు సమర్ధవంతమైన ఫలితాలు అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన పని, జీవిత సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ఐటీ, జీసీసీ పాలసీ 4.0 ఆ దిశగా గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు వెల్లడించారు. ప్రతి నగరం, పట్టణం, మండలంలో ఐటీ కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అందుకు తగ్గ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. అట్టడుగు స్థాయిలో ఉపాధిని సృష్టించేందుకు ఐటీ, జీసీసీ సంస్థలకు మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు ఎక్కువ శ్రామికశక్తి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయని తాను విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ■

# వ్యవసాయంలో స్వయంసహాయ మహిళా సైన్యం!



దేవభూమిగా భావించే నేలపై తమకంటూ సొంతమైన కుంచెడు భూమి లేనిపేద మహిళలు వారు. కేరళ ప్రభుత్వం ఇచ్చిన చిన్న ఆసరాతో సాగునే నమ్ముకొని వేరే ఉపాధికి నోచుకోని మహిళలు చేయి... చేయి కలిపారు. సాగుబాటలో వేల అడుగులు జత కూడాయి. మహిళల నుదుటి చెమట చుక్కలు చిందిన బీడు భూములు విరగపండాయి. పైర్లు పరవళ్ళు తొక్కాయి. వ్యవసాయం లాభసాటి కాదనే మాటలు నీటిమీది రాతలుగా తేలాయి. కేరళలో 10,000 హెక్టార్లలో కుడుంబశ్రీ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం జరుగుతోంది. వ్యవసాయంలో మాదే పైచేయి సుమా అంటున్నారు కేరళ మహిళా రైతులు!

భూమిలేని మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా కేరళ ప్రభుత్వం ప్రారంభించిన వినూత్న కార్యక్రమం కుదుంబశ్రీ. కేరళ రాష్ట్ర పేదిరిక నిర్మూలన సంస్థ నేతృత్వంలో 1998లో ఊపిరి పోసుకున్న 'కుదుంబ శ్రీ' కేరళ గడ్డపై మహిళా సంఘటిత శక్తికి ప్రతీకగా ఎదిగింది. ఆ రాష్ట్రం మొత్తం ప్రధానంగా ఎదుర్కొనే సమస్య ఉపాధి. ముఖ్యంగా తమకంటూ సొంత వ్యవసాయ భూములు లేని కుటుంబాలే ఎక్కువ. స్థానిక సాగుభూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగించటం వల్ల నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉండేది. వ్యవసాయరంగంలో పని చేసేది ఎక్కువగా మహిళలే కావటంతో పనులు దొరక్క తీవ్ర ఒడిదుడుకులకు లోనవ్వాల్సి వచ్చేది. రాష్ట్ర భూ సంస్కరణల చట్టం కౌలుపై నిషేధం విధించింది.అధికారికంగా కౌలుకు ఇస్తే తమ భూమిపై హక్కును శాశ్వతంగా కోల్పోతామనే భయం యజమానుల్లో ఉండేది. కూలిపనులు మానుకొని సొంత వ్యవసాయం చేయాలనుకునే వారికి అది అందని ద్రాక్ష అయింది.

**సంఘటిత శక్తే తారక మంత్రం...**

ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లోను కేరళ ప్రభుత్వం వెనుకడుగేయలేదు. సామూహిక వ్యవసాయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భూమిలేని మహిళలకు పొలం, పంటతో అనుబంధం కల్పించటమే లక్ష్య సాధనలో తొలి అడుగుగా కొంతమంది భూమిలేని మహిళలను కలిపి 15–40 మంది మహిళలను కలిపి స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, వ్యక్తిగత వ్యసాయ భూములను గుర్తించి సంఘాలకు దఖలు పరిచారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు సాగులో సేంద్రియ పద్ధతులకు పెద్ద పీట వేశారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు మహిళా రైతుల కోసం ఏర్పాటు చేశారు. మంచి దిగుబడులను సాధించిన సంఘాలకు ఆర్థిక ప్రోత్సాహకాలను కల్పించేవారు. అన్ని జిల్లాల్లో 201

క్లస్టర్లలో 10,000 హెక్టార్లలో కుదుంబశ్రీ ఆధ్వర్యంలో సేంద్రియ ప్రకృతి సేద్యం జరుగుతోంది. నాబార్డు సహకారంతో కుటుంబశ్రీ పథకం క్రింద బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిం చారు. రుణాలు తీసుకోవటం తిరిగి చెల్లించటంలో ఆయా సంఘాల్లోని మహిళా సభ్యులందరిది ఉమ్మడి బాధ్యత. ఒక్క తిరువనంతపురం జిల్లాలోనే ఆరు వేల గ్రూపులు ఏర్పాటయ్యాయి.

**వనితా కర్మసేన**

వీటిలో సుమారు 30 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆధునిక పద్ధతుల్లో అరటి సాగుపై కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇచ్చిన శిక్షణతో తక్కువ కాలంలోనే రెండితల దిగుబడులు సాధించారు. వనితా కర్మసేన పేరుతో కుడుంబశ్రీ కోసం వ్యవసాయ పరికరాలను, యంత్రాలను ఉపయోగించటంలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. కొనుగోలుకు రుణాలు ఇచ్చారు. ప్రతి సంఘానికి తమ సొంత పరికరాలు ఉన్నాయి. తామే శ్రామికులుగా మారటంతో ఖర్చును ఆదా చేయగలిగారు. పంటను నష్టపోయిన సందర్భాల్లో నాబార్డ్ మహిళా రైతులకు అండగా నిలిచింది.

47 వేల పై చిలుకు సంఘాలు, లక్ష ఎకరాల్లో సాగు చేస్తున్నాయి. జీడిమామిడి, కొబ్బరి, వరి, అరటి, పైనాపిల్ పండ్ల తోటలు, ఆకు కూరలు, గుమ్మడి, బఠాణీ, సొర, అల్లం, బెండ, మిరప వంటి పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. తాము పండించిన పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయించటంతో మంచి లాభాలు కళ్ళజూస్తున్నారు. ఆరు నెలలు తిరగకుండానే రుణాలు తిరిగి చెల్లించారు. ఒక్కో సీజన్‌లోనే ఈ సంఘాలు రూ. లక్ష వరకు నికరాదాయం ఆర్జించేవి.

దీంతో తమకంటూ సొంత ఇళ్లను నిర్మించుకున్నారు. చిన్న వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారు. బ్యాంకులు గతంలో మహిళలకు రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చేవి కాదు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. 10543 స్వయం సహాయక సంఘాలకు రూ. 123 కోట్ల రుణాలు ఇచ్చారు. ఇప్పుడు బ్యాంకుల దృష్టిలో మహిళా రైతులు అంటే మంచి పరపతిగల మహిళలు! ■

## కలుపు తీసే 'బ్యాటరీ' యంత్రం



అన్నదాతల ఇబ్బందులను తొలగించేందుకు బ్యాటరీతో నడిచే కలుపు తీసే యంత్రాన్ని రూపొందించారు అనకాపల్లి వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థులు. ఆ వివరాలను ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, డాక్టర్ పి. శ్రీదేవి సోమవారం విలేకులకు వివరించారు. 'చెరుకు సాగులో కలుపు ప్రధాన సమస్య. రెండు పర్యాయాలు కలుపు తీయాలి. ఇందుకు రైతులు ఒకసారికి దాదాపు రూ. 10 వేల చొప్పున ఖర్చు చేస్తున్నారు. కలుపు తీసేందుకు డీజిల్, పెట్రోల్‌తో నడిచే వీడర్లు ఇప్పటికే మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నాలుగు బ్యాటరీలను ఉపయోగించి కలుపు తీసే వీడర్‌ను విద్యార్థులు తయారు చేశారు. దీని ద్వారా ఎకరా భూమిలో కలుపు తీయడానికి మూడు గంటలు సమయం పడుతుంది. బ్యాటరీలు ఒకసారి చార్జిచేస్తే నాలుగు నుంచి ఐదు గంటలు నడుస్తుంది.

సౌరశక్తితోనూ చార్జింగ్ చేయవచ్చు. ఒక కేవీ సామర్థ్యం కలిగిన ప్యానల్‌ను ఉపయోగిస్తే సరిపోతుంది. ఈ యంత్రం ఖరీదు రూ. 80 వేలు. దీన్ని విద్యార్థులు మణిరత్నం, ప్రశాంతి, అజయ్, భాను, రష్మి, జనార్ధన్, జహ్నవిరాణి, సాయిసుదర్శిని, లావణ్య తయారు చేశారు' అని శాస్త్రవేత్తలు వివరించారు. ■

# తాను మరణిస్తూ, మరో ఐదుగురికి ప్రాణదానం!



**తా**ను మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణం పోసిందా వైద్యురాలు..! ఒక్కగానొక్క కుమార్తె తమకు దక్కదన్న కొండంత దుఃఖాన్ని దిగమింగుకుని, అవయవాలను దానం చేసి బిడ్డ కోరిక తీర్చారు ఆమె తల్లిదండ్రులు.. ఏపీలోని శ్రీసత్యసాయి అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం తలుపులు మండల నంగివాండ్లపల్లికి చెందిన నంగి నందకుమార్‌రెడ్డి, లోహితల కూతురు భూమికారెడ్డి (24).. ఇటీవలే వైద్య విద్య పూర్తిచేసి హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా వైద్య సేవలు అందిస్తోంది. ఫిబ్రవరి 1వ తేదీన హైదరాబాద్‌లో భూమికారెడ్డి ప్రయాణిస్తున్న కారు.. డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది.

దీంతో ఆమె తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకోగా నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. చివరికి వారం తర్వాత ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో గతంలో భూమికారెడ్డి అవయవదానంపై చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకున్న తల్లిదండ్రులు.. ఆమె అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చారు. వైద్యులు భూమికారెడ్డి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు సేకరించి అవసరమైన వారికి అవయమార్పిడి చేసి ప్రాణాలు కాపాడారు. అనంతరం భూమికారెడ్డి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం స్వగ్రామం నంగివాండ్లపల్లికి తరలించారు. భూమికారెడ్డి త్యాగం చిరస్మరణీయమని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. భూమికారెడ్డిని, ఆమె తల్లిదండ్రుల ఔదార్యాన్ని సోషల్ మీడియాలో పలువురు ప్రశంసించారు. ■

## ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి యిలా దరఖాస్తు చేసుకోండి !

**ప్ర**ధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా రైతుల పెట్టుబడి కోసం ప్రతి ఏడాది రూ. 6 వేలు.. అది కూడా రూ. 2 వేలు చొప్పున మూడు విడతలగా వారికి అందిస్తోంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే పీఎం కిసాన్ అధికారిక వెబ్ సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఈ పథకంలో భాగంగా రూ. 11 కోట్ల రూపాయలకు పైగా కేంద్ర ప్రభుత్వం రైతులకు సహాయంగా అందిస్తోంది. ఈ పథకం వల్ల కోట్లాది మంది రైతులకు లబ్ది చేకూరుతోంది.

**కిసాన్ క్రెడిట్ కార్డ్:**

దేశానికి రైతే వెన్నుముక. అయితే చాలా సందర్భాల్లో వారి వద్ద పంటకు పెట్టుబడి పెట్టేందుకు చేతిలో సరిపడా నగదు ఉండదు. ఆ సమయంలో వారికి సహాయం సైతం అందదు. అలాంటి వేళ.. రైతులకు ఎటువంటి హామీ లేకుండా రుణాలను అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకోసం.. 1998లో కిసాన్ క్రెడిట్ కార్డులను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. అయితే ఈ పథకం ద్వారా కేవలం రుణాన్ని అందించడం మాత్రమే కాకుండా రైతుల తీసుకున్న వడ్డీలో నాలుగు శాతం రాయితీని సైతం అందిస్తుంది. ఇటువంటి పథకాల వలన రైతుల పెట్టుబడి, రుణాలను తిరిగి చెల్లించడానికి ఎంతో ఉపయోగపడుతోంది. ■

అవే అవకాశాలు ...వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవడానికైనా, దిగజార్చుకోవడానికైనా

# గ్రామాభివృద్ధిలో అవార్డులు సాధించిన మహిళా సర్పంచ్!

**అం**దుబాటులో ఉన్న వనరులన్నిటినీ సద్వినియోగం చేసుకున్నారు. అన్ని పనుల్లో స్వయంగా శ్రమిస్తూ, గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపారు. తన కృషికి గుర్తింపుగా ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి పురస్కారం అందుకున్న గుంటూరు జిల్లా గొడవర్రు గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవితో జరిపిన సంభాషణను ఆంధ్రజ్యోతి 'నవ్య'లో ప్రచురించారు. ఆ గ్రామ అభివృద్ధి ప్రస్థాన విశేషాలు ఆంధ్ర జ్యోతి సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకులకోసం ....

అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ఎన్నో అవహేళనలు ఎదుర్కొన్నారు. ఒత్తిడులను, వేధింపులను తట్టుకొని నిలబడ్డారు. నిధులకోసం కోర్టు మెట్లు సైతం ఎక్కారు. అందుబాటులో ఉన్న వనరులన్ని టినీ సద్వినియోగం చేసుకున్నారు. అన్ని పనుల్లో స్వయంగా శ్రమిస్తూ, గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపారు. తన కృషికి గుర్తింపుగా ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి పురస్కారం అందుకున్న గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని గొడవర్రు గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవితో 'నవ్య' సంభాషణ.



''సర్పంచ్‌గా గెలవగానే అభినందనలతోపాటు అవహేళనలు కూడా నాకు తీవ్రంగానే ఎదురయ్యాయి. "చదివింది ఇంటర్. పరిపాలన ఏం చెయ్యగలవు?" అని కొందరు, ''మహిళవు. ఊరికోసం చొరవ తీసుకొని కష్టపడలేవు" అని ఇంకొందరు... ఇలా ఎంతోమంది నిరుత్సాహపరిచారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే... "ప్రతి వివరం మీతో చెప్పలేం కదా! అయినా కార్యాలయాల చుట్టూ మీరెక్కడ తిరుగుతారు? ఎవరినైనా పంపవచ్చు కదా" అనే సలహాలు వినిపించేవి. ఈ మాటలన్నీ నాలో పట్టుదల పెంచాయి.

సాధారణంగా మహిళలు పదవుల్లో ఉంటే... పెత్తనం, పాలన పురుషులు చేస్తూ ఉంటారు. ఈ సంస్కృతికి నేను వ్యతిరేకం. ఇల్లు చక్కదిద్దగలిగే మహిళలకు ఊరు బాగు చేయడం కూడా తెలునని నిరూపించాలని నిశ్చయించుకున్నాను.

మా నాన్న ఇక్కుర్తి శివనాగేశ్వరరావు, తల్లి ఉమామహేశ్వరి. వ్యవసాయమే జీవనాధారమైన మధ్యతరగతి కుటుంబం. నన్ను ఇంటర్ వరకూ చదివించాక... పెళ్లి చేశారు. నా భర్త వెంకటేశ్వరరావు కూడా రైతే. మాకున్న ఎకరా పొలంతోపాటు మరికొంత భూమి కౌలుకు తీసుకున్నాం. ఇంటి పనులు, పొలం పనులతో కాలం గడిచేది. కాగా... మా మామగారు 1995లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. అప్పటినుంచి మా కుటుంబం రాజకీయాలకూ దూరంగానే ఉంటూ వచ్చింది. కానీ మా కుటుంబంలో ఎవరో ఒకరు సర్పంచ్ కావాలనేది ఆయన బలమైన కోరిక.

కిందటి ఎన్నికలలో ఆ అవకాశం నాకు అనూహ్యంగా, నన్ను వెతుక్కుంటూ వచ్చింది. మొదట వద్దనుకున్నాను. కానీ కుటుంబం, సన్నిహితులు ప్రోత్సహించడంతో పోటీ చేశాను. ప్రజలు కూడా మద్దతు ఇచ్చారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలవారు ఓటువేసి గెలిపించారు. పదవి అంటే అలంకారప్రాయం కాదనీ, ఎన్నో రాజకీయాలను, కుట్రలను ఎదుర్కొవాల్సి ఉంటుందని, జనం మెప్పు పొందడం కత్తిమీద సాము అని తక్కువ కాలంలోనే తెలుసుకున్నాను

**కూలీగా వెళ్లాను...**

మాది మూడువేల మంది జనాభా ఉన్న గ్రామం. అయితే ఏ పని చెయ్యాలన్నా నిధులు లేని పరిస్థితి. దీంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్,



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ సద్వినియోగం చేసుకోవాలనుకున్నాను. అయితే వాటిని కూడా సరిగ్గా అందనివ్వలేదు. దానికోసం పోరాడాను. అధికారులను నిలదీశాను. చివరకు ఒక దశలో... పంచాయతీలకు దామాషా ప్రకారం అందాల్సిన నిధుల కోసం కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. న్యాయపరంగా పోరాడి నిధులు సాధించుకోగలిగాం.

మరోవైపు గ్రామాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టాను. గ్రామానికి వస్తున్న నీరు ఆకుపచ్చగా, దుర్గంధభరితంగా ఉండడంతో... వాటిని తాగినవారు రోగాల బారిన పడేవారు. ఇది నన్ను తీవ్రంగా కలచివేసింది. సురక్షిత జలాల సరఫరా కోసం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ .4.8 లక్షలతో 980 మీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్లు, కొత్త కొళాయిలు వేయించాం. చెరువులో నీటిని శుద్ధి చేసి పంపడానికి కావలసిన ఫిల్టర్ బెడ్స్ దెబ్బతిన్నాయి. వాటిని బాగుచేయించడానికి నిధులు అడిగితే పట్టించుకున్నవారు లేరు. ఆఖరుకు దాతల సహకారంతో తాత్కాలిక మరమ్మతులు చేయించి, సురక్షిత నీటిని అందించగలిగాం.

జల్‌జీవన్ మిషన్ నిధులను సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి సాధించిన సర్పంచ్‌లుగా... ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదుగురు ఎంపికైతే... వారిలో నేనూ ఉన్నాను. ఇక, ఉపాధి హామీ నిధులతో చెరువును బాగు చేయాలనుకున్నప్పుడు మరో సమస్య ఎదురయింది. కూలీల హాజర్లు పడుతున్నాయి, పనులు మాత్రం జరగడం లేదు. అలా వదిలేస్తే లాభం లేదని... నేను కూడా ఒక కూలీగా వెళ్లి, వారితో కలిసి పని చేశాను. పూడిక తీత, చెరువు కట్టలను పటిష్టం చేయడం లాంటి పనులన్నీ వారి వెంటే ఉండి చేయించాను. ఈ పథకంతో ఒక క్లినిక్ కూడా నిర్మించుకోగలిగాం. ఉపాధి హామీ నిధులతో సాధించిన అభివృద్ధిలో... రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచాం. గ్రామంలో... రూ. 50 లక్షలతో మొత్తం సిమెంట్ రోడ్లను దాదాపు పూర్తి చేశాం. కాలువల అంచులపై గడ్డి మొలవకుండా నేనూ వెళ్లి మందులను పిచికారీ చేస్తాను. అవసరమైతే నీరు కూడా మోసుకొస్తాను. ఏదీ నామోషీగా భావించను.

**ఎన్నారైల చొరవతో...**

మా గ్రామం చిన్నది కావటంతో జనాభా ప్రాతిపదికన వచ్చే నిధులు చాలక దాతల సహకారం తప్పనిసరి అయింది. దూర ప్రాంతాల్లో స్థిరపడిన మా గ్రామస్తులు, ముఖ్యంగా ఎన్నారైలు ఎప్పుడు ఊరికి వచ్చినా... గ్రామాభివృద్ధి కోసం సాయం చేయమని నిర్మొహమాటంగా అడుగుతాను. ఇటీవలే ఎన్నారై శ్రీ మద్దినేని శ్రీనివాస్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు గుర్తించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 10 లక్షలు సాయం చేయటానికి ముందుకు వచ్చారు. నా సోదరుడు, మరికొందరు కలసి గ్రామంలో ఎల్.ఇ.డి లైట్లన్లు రూ. 3 లక్షలతో వేయించారు. మైకులు పెట్టించి వాటిద్వారా జనానికి సమాచారం ఇవ్వటం, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల వివరాలు తెలియచెయ్యటం లాంటివి చేస్తున్నాం. ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబుగారిని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారిని కలిసి, గ్రామాభివృద్ధికి సహకారం కోరాం. వారినుంచి సానుకూల స్పందనే వచ్చింది.

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ గణతంత్ర దినోత్సవం రోజున... దేశంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు పురస్కారాలు అందించింది. స్వచ్ఛ భారత్, జాతీయ ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్ మిషన్ లాంటి వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని ఉన్నత స్థానంలో నిలిపినందుకు వీటిని ఇచ్చారు. మిగిలిన సర్పంచ్‌లంతా స్వచ్ఛ పురస్కారాలను అందుకుంటే, నాకు అదనంగా కేంద్ర జల వనరులశాఖ నుంచి కూడా పురస్కారం దక్కింది. ఈ గౌరవం గ్రామాభివృద్ధికి సహకరించిన వారందరికీ చెందుతుంది."

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■

# రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య!

**రై**తన్నల కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు, సేవలు అమలు చేస్తున్నాయి. అయితే ఈ పథకాలు పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకు చేరడం లేదు. నకిలీ రైతులు, బినామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తోంది. అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చేలా ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ప్రతి రైతుకు నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నారు. ఏపీలోని కొన్ని జిల్లాలలో ఇప్పటికే అన్నదాత వివరాల నమోదు ప్రక్రియ మొదలైంది.

ఏపీలో రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) ద్వారా రైతులకు ఈ విశిష్ట సంఖ్య జారీ చేస్తున్నారు. ఇందుకోసం భూమి ఉన్న ప్రతి రైతూ అర్హుడే. రైతులు తమ అధార్ కార్డు, ఆధార్ కార్డులు లింక్ అయిన ఫోన్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని సంప్రదించాలి.

రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల సమక్షంలోనే ఈ విశిష్ట సంఖ్య కోసం కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. నిర్దేశిత పోర్టల్‌లో రైతుభూమి వివరాలు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు నమోదు చేస్తారు. ఈ నమోదు పూర్తికాగానే రైతుల మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియజేస్తే నమోదు ప్రక్రియ పూర్తై రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు

మరోవైపు రైతులకు జారీ చేసే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు సహా వ్యవసాయ సేవలు పొందడానికి ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుందని వివరిస్తున్నారు. ఈ విశిష్ట సంఖ్య ద్వారా అర్హులైన రైతుల గుర్తింపు జరుగుతుందని.. అలాగే ఆ రైతులకు పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వ్యవసాయ పరికరాలపై రాయితీలు, పంట నష్టపరిహారం వంటివి అందాలంటే ఈ విశిష్ట సంఖ్య అవసరమని చెప్తున్నారు. ఆలాగే తెగుళ్లు, సాగునీటి సమస్యలపైనా అధికారుల నుంచి సలహాలు పొందవచ్చని సూచిస్తున్నారు. త్వరలో ఈవిడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో పడనుండగా వారు తక్షణం ఈ గుర్తింపు కార్డులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ■

## వ్యవసాయ కూలీలకు విమాన యోగం

**గా**ల్లో విమానం ఎగురుతుంటే పిల్లలే కాదు.. పెద్దలు కూడా ఇంటి బయటకు వచ్చి వింతగా, ఆశ్చర్యంగా చూస్తారు. ఓ రైతు పొలంలో పని చేసే మహిళా కూలీలు కూడా అదే చేశారు. వ్యవసాయ కూలీలకు విపరీతమైన కొరత ఉన్నా.. అతడి పొలంలో మాత్రం పది మంది మహిళలు క్రమం తప్పకుండా పని చేస్తున్నారు. అందుకు కృతజ్ఞతగా



వారికేదైనా చేయాలని ఆ రైతు భావించాడు. ఆకాశంలో విమానం ఎగురుతున్న ప్రతిసారీ ఆ కూలీలు పని మానేసి ఆకాశం వైపు చూస్తుండటాన్ని గమనించిన విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా శిరగనహళ్లి గ్రామ రైతు విశ్వనాథ్‌కు తన కూలీలను కూడా విమానం ఎక్కించాలనే ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా.. పది మంది కూలీలనూ ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో మంగళవారం గోవా తీసుకెళ్లారు. శివమొగ్గ విమానాశ్రయం నుంచి ఆయన కూడా వారితో కలిసి వెళ్లారు. ఈవిధంగా వ్యవసాయ కూలీలకు జీవితాంతం గుర్తుండిపోయే కానుక ఇచ్చారు. ■

సరైన నిర్ణయం ఆత్మవిశ్వాసాన్ని పెంచితే, తప్పుడు నిర్ణయం అనుభవాన్ని పెంచుతుంది ; రెండూ మంచికే

# ఒంగోలు జాతి పశువులకు విశ్వకీర్తి కిరీటం !

♦ ప్రపంచ ఖ్యాతి గడించిన ఒంగోలు గిత్త ♦ బ్రెజిల్ వేలంలో రూ.41 కోట్లు పలికిన ఒంగోలు ఆవు

ఎవరైనా ఒడ్డూ పొడుగు ఉండి, ఠీవిగా కనిపిస్తే 'ఒంగోలు గిత్తలా ఉన్నాడు' అంటారు. ఎద్దులలో అనేక జాతులు ఉన్నప్పటికీ ఒంగోలు జాతి గిత్తలకు ఉన్న క్రేజ్ ఇది. బ్రెజిల్‌లో నిర్వహించిన వేలంలో వియాటినా 19 రకం ఒంగోలు జాతి ఆవు రూ. 41 కోట్ల ధర పలకడంతో ఒంగోలు జాతి ఆవులు, ఎద్దులు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. చూడటానికి ఒంగోలు గిత్తలు ఎంత అందంగా ఉంటాయో, అవి బరిలో దిగి కలబడే తీరూ అంతే అందంగా ఉంటుంది. ఇక... ఒంగోలు జాతి ఆవుల పరంగా చూస్తే రోజుకు 20 లీటర్ల పాలు ఇస్తాయి. అయితే, రచ్చ గెలిచిన ఈ జాతి ఇంట మాత్రం తగ్గిపోతోంది. వాటికి మేత దొరకడమే కష్టంగా ఉంది. వీటి సంరక్షణ రైతులకు కష్టంగా మారింది. ప్రభుత్వం ప్రోత్సాహం అందకపోతే ఒంగోలు జాతి ఎడ్ల మనుగడే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది.


*బ్రెజిల్ వేలంలో రూ. 41 కోట్లుపలికిన ఒంగోలు జాతి ఆవు*

**ఎన్ని ప్రత్యేకతలో !**

ఆకారంలో, కొమ్ముల రూపులో విలక్షణత! విశాలమైన కాళ్లు, వెడల్పాటి నుదురు, పెద్ద చెవులు, గంగడోలు, ఎత్తయిన మూపురం. చిన్న మొహం... ఇలా ఒంగోలు జాతి గిత్తలకు ఎన్ని ప్రత్యేకతలో! ఒంగోలు జాతి పశువులకు జన్మస్థానం ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ పరీవాహక ప్రాంతం. ఆ ప్రాంతంలోని ఉలిచి, కరవది తదితర గ్రామాల్లో ఈ జాతి పశువులు ఎక్కువగా కనిపిస్తాయి. ఒకప్పుడు ఎక్కడ పందేలు జరిగినా ఒంగోలు జాతి గిత్తదే విజయం. దీంతో ఈ జాతి పేరు ఖండాంతరాలకు వ్యాపించింది. బలిష్ఠంగా ఉండటంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయని పేరు. అలాగే ఎంత బరువైనా లెక్క చేయకుండా బండిని లాగుతాయి. పౌరుషానికి పెట్టింది పేరు. ఒంగోలు జాతి పశువులను గురించి తెలుసుకున్న బ్రెజిల్ దేశం తొలిసారిగా 1863లో తమ దేశానికి ఈ జాతి పశువులను దిగుమతి చేసుకుంది.

1950 ప్రాంతంలో కరవది గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి ఒంగోలు జాతి ఎద్దును పెద్ద ధరనే చెల్లించి బ్రెజిల్ దేశస్థులు కొనుగోలుచేసి తమ దేశానికి ఓడలో తరలించారు. ఈ విషయం అప్పట్లో జనం గొప్పగా చెప్పుకొనేవారని పెద్దలు చెబుతుండేవారు. తొలుత బ్రెజిల్‌లో, అనంతరం పలు దేశాల్లో ఒంగోలు జాతి పశు సంపద అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఇటీవల బ్రెజిల్‌లో నిర్వహించిన వేలంలో వియాటినా 19 రకం ఒంగోలు జాతి ఆవు రూ. 41 కోట్ల ధర పలికింది.

**నవ నలుపులు ప్రత్యేకం**

చక్కటి శరీర సౌష్టవం, రాజసం ఉట్టిపడే నడక ఒంగోలు జాతి గిత్తల ప్రత్యేకత. గిత్తల శరీరంపై తొమ్మిది భాగాల్లో నలుపు వర్ణం ఉంటుంది. మేలుజాతి ఒంగోలు ఎడ్లను బేరం చేసేవారు ప్రత్యేకంగా దీనిని పరిశీలిస్తారు. ఎద్దు ముట్టే, తోక చివర భాగం, చెవి అడుగుభాగం, బొడ్డు, గిట్టల వెనుకభాగం, మూపురం, ఎద్దు మడి, కనుబొమ్మలు, వృషణాల కిందభాగంలో నలుపులను చూస్తారు. ఎద్దు శరీరంపై సుడులు ప్రత్యేకంగా ఉంటాయి. ఎద్దు నుదిటిపై,

వెన్నెముకపై, తోక వద్ద, చంక వద్ద సుడులను బేరగాళ్లు ప్రత్యేకంగా చూస్తారు. తప్పు సుడులు ఉంటే ఆ గిత్తను సాకేందుకు రైతులు ఇష్టపడరు. గంగిరెద్దుల వారికి ఇస్తుంటారు.

**పది గిత్తలతో ప్రయోగాత్మకంగా..**

ఒంగోలు ప్రాంతంలోని చదలవాడలో ఏర్పాటైన పశు ఉత్పత్తి క్షేత్రంలో వీర్యం కోసం (సెమన్ కోసం) గిత్తలను పెంచుతున్నారు. గతంలో టీజర్ బుల్ మాత్రమే ఈ క్షేత్రంలో ఉండేది. ప్రస్తుతం ఇక్కడే పుట్టిన పది గిత్తలను తొలిసారిగా వీర్యం కోసం ప్రత్యేకంగా సాకుతున్నారు.

రెండు నుంచి రెండున్నరేళ్లు ఉన్న ఈ గిత్తలు మరో ఏడాదిలో వీర్యం ఉత్పత్తికి సిద్ధంగా ఉంటాయి. అయితే వీర్యం సేకరణ, నిల్వలకు సరైన ల్యాబ్‌లు ఈ క్షేత్రంలో లేవు. పోషణ కష్టం కావడంతో రైతాంగం వాటిని అమ్మేసుకోవాల్సిన పరిస్థితి!

**అక్రమ మార్గంలో బ్రెజిల్‌కు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర దేశాలకు ఒంగోలు జాతి ఎద్దుల ఎగుమతిని నిలిపివేశాయి. దీంతో బ్రెజిల్ సహా పలు దేశాలకు చెందిన వారు ఒంగోలు ఎడ్లను స్థానికంగా కొనుగోలుచేసి గుజరాత్ రాష్ట్రంలో వాటి యాంబ్రియోలను (పిండాలు) సేకరించి వాటిని అక్రమ మార్గంలో వారి దేశాలకు తరలిస్తున్నారు..! తద్వారా వారి వద్ద ఇప్పటికే వృద్ధి చెందిన ఒంగోలు జాతి పశుసంపదలో జన్యుపరమైన నాణ్యతను పెంచుకుంటున్నారు. అయితే, ఒంగోలు ఎద్దుల పుట్టినిల్లు అయిన ప్రకాశం జిల్లాలో యాంబ్రియో (పిండం) తయారీ కేంద్రం లేదు. గుంటూరు లాం ఫాం నుంచి, నెల్లూరు జిల్లా చింతల దీవి నుంచి యాంబ్రియోలు సరఫరా అవుతుంటాయి.

**పడిపోతున్నఎద్దు బరువు**

గతంలో ఒంగోలు జాతి గిత్తలు 1,300 కిలోలు ఉండేవి. వ్యవసాయంలో వాటి ఉపయోగం లేకపోవడం, వాటిని సాకడం రైతులకు వ్యయప్రయాసగా మారడంతో క్రమేపి వీటిని పెంచేవారి సంఖ్య తగ్గుతోంది. దీంతో క్రమేపి బరువు 1,100కు పడిపోతోంది.

**చదలవాడలో పశు ఉత్పత్తి క్షేత్రం**

ఒంగోలు జాతి పశుసంపదను పరిరక్షించేందుకు నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రాన్ని అప్పటి సీఎం చంద్రబాబు చొరవతో ఏర్పాటు చేశారు. 1980 వరకు ఈ క్షేత్రం ప్రకాశం జిల్లా రామతీర్థం వద్ద ఉండేది. ఆ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు వృద్ధి చెందడంతో వేరొక ప్రాంతానికి తరలించాలని యోచించి,, చదలవాడలో 200 ఎకరాలలో పశుక్షేత్రం ఏర్పాటు చేయించారు. ఇక్కడ ప్రస్తుతం 330 పశువులున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా దాణా తెప్పిస్తారు. ఏటా విజయవాడకు చెందిన వీబీఆర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు ఇక్కడి పశువుల రక్తనమూనాలను సేకరించి టీబీజేడీ, తెప్టస్వారా, బ్రూసెల్లా లాంటి వ్యాధులకు గురికాకుండా పర్యవేక్షిస్తుంటారు. ప్రతి మంగళవారం పలు పరీక్షలు చేస్తారు. సరోగసి విధానం ద్వారా ఒంగోలు జాతి పశుసంతతి వృద్ధి చేస్తుండడం ఇక్కడ ప్రత్యేకత.. ప్రస్తుత ప్రభుత్వం పశుక్షేత్రంపై దృష్టి సారించింది. రూ. 23 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే, పూర్తిస్థాయిలో ఒంగోలు గిత్తలను సంరక్షించాలంటే రూ. 85 కోట్లు అవసరం అవుతాయని వ్యవసాయ పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

**ఇది కదా పౌరుషమంటే..!**

బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన రైతు పోపూరి శ్రీనివాసరావు ఒంగోలు జాతి ఎడ్లను పోషిస్తున్నారు. ఆయన వద్ద ఉన్న ఎడ్లు వందసార్లు బల ప్రదర్శన పోటీల్లో పాల్గొని 60సార్లు పతకాలు గెలిచాయి. ఒకసారి తెలంగాణలో జరిగిన పోటీల్లో పతకం సాధించిన తర్వాత బ్రెజిల్‌కు చెందిన వ్యక్తి 3 జతల ఎద్దులకు రూ.1.80 కోట్లు ఇస్తానని ఆఫర్ ఇచ్చినా, శ్రీనివాసరావు అందుకు అంగీకరించలేదు. 'పశువులను అమ్ముకుని బతుకుతారు' అని ఆ వ్యక్తి ఎగతాళిగా మాట్లాడటం తనను బాధించిందని, అందుకే అమ్మలేదని శ్రీనివాసరావు చెప్పారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...)

■

కోరుకున్నట్టు జీవితం నడవకపోవచ్చు , కాని జీవించే అనుక్షణం ఉదాత్తంగా నడవగలిగితే చాలు


మీకు తెలుసా ?

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-03-2025 ; Posting Date: 05 & 06-03-2025

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26





మదనపల్లిలో ఏపిమాస్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సదస్సు దృశ్యాలు





గోరంట్లపల్లిలో నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం ... మరికొన్ని దృశ్యాలు



సి ఎస్ ఏ ఆధ్వర్యంలో ఏపిమాస్ , అశోక
విశ్వవిద్యాలయం ప్రతినిధులకు శిక్షణ



ఎన్ టి ఆర్ మహిళా కళాశాలల
విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్



ఏ ఎన్ రావు నగర్‌లో ఎస్ హెచ్ జి మహిళలకు
ఆరోగ్య భద్రతపై అవగాహన




తమిళనాడుకు చెందిన ఇసాఫ్ ఫౌండేషన్ ప్రతినిధులకు ఏపిమాస్ శిక్షణ ... అవగాహన పర్యటన

To ADDRESS



ఏపిమాస్ ఇ డి శ్రీమతి రామలక్ష్మి నిమ్మనపల్లి,
కురబలకోట ఎఫ్ పి ఓల సందర్శన

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089